
# వేకువ సమయం

సంపుటి: 14 సంచిక: 171

VEKUVA SAMAYAM TELUGU DAILY

* Mahabubnagar * Hyderabad * Miryalaguda & Rangareddy | సంపాదకులు : కె.భాస్కర్‌రావు | రూ.2.00/- పేజీలు 8 | తేది: శుక్రవారం 17 జూలై 2026





**సమయం ప్రతినిధి:** ఒడిశాలోని పూరీ జగన్నాథ రథయాత్రలో అపశ్రుతి చోటుచేసుకుంది. గ్రాండ్ రోడ్డులో రద్దీ విపరీతంగా పెరగడంతో తొక్కిసలాట తరహా పరిస్థితి నెలకొంది. ఈ ఘటనలో ఒకరు మరణించగా 100 మందికి పైగా గాయపడ్డారు. వెంటనే స్పందించిన ఎమర్జెన్సీ సిబ్బంది క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం, రద్దీ విపరీతంగా పెరగడంతో ఓ వ్యక్తికి ఊపిరాడక స్పృహ తప్పిపోయినట్టు తెలిసింది. వెంటనే ఆ వ్యక్తిని పూరీ జిల్లా ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతడు మృతి చెందినట్టు వైద్యులు ప్రకటించారు అయితే, ఈ విషయంపై అధికారులు ఇంకా ఎలాంటి ప్రకటన విడుదల చేయలేదు. మరోవైపు, రద్దీ ఎక్కువైన ప్రాంతంలోని మిగిలిన వారిని సహాయక సిబ్బమది తక్షణం తరలించారు. సుమారు 120 మందిని ఆసుపత్రిలో చేర్చినట్టు తెలుస్తోంది. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఈ ఘటన నేపథ్యంలో రద్దీ నియంత్రణకు అధికారులు మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్టు తెలుస్తోంది. ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు చేపట్టినట్టు సమాచారం. ప్రపంచప్రఖ్యాతి గాంచిన పూరీ జగన్నాథుడి రథయాత్ర లక్షల మంది భక్తుల మధ్య గురువారం ప్రారంభమైన విషయం తెలిసిందే.




**సమయం ప్రతినిధి :** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)లోని వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న శాస్త్రవేత్తలు భారీ ఎత్తున రాజీనామాలు చేస్తున్నారు. వీటిని నియంత్రించేందుకు అంతరిక్ష విభాగం (డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్) కీలక నిర్ణయం తీసుకుంది. శాస్త్రవేత్తలకు రాజీనామాల నిబంధనలను కఠినతరం చేసింది. ఈ ఆదేశాలను అంతరిక్ష విభాగం గురువారం జారీ చేసింది. వాటిని యూఆర్ రావు శాటిలైట్ సెంటర్, విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ లతోపాటు వివిధ ప్రాంతాల్లో ఉన్న పలు కేంద్రాలకు కూడా పంపింది. భారత్ చేపట్టిన ప్రతిష్ఠాత్మక మానవ అంతరిక్ష యాత్ర కార్యక్రమం గగన్‌యాన్‌తోపాటు ఇతర 'ముఖ్యమైన మిషన్ల'కు అనుబంధంగా పని చేస్తున్న గ్రూప్- ఏ శాస్త్రవేత్తలు, సాంకేతిక సిబ్బంది నుంచి వచ్చే రాజీనామాలు, స్వచ్ఛంద పదవీ విరమణ అభ్యర్థనలు యథావిధిగా అంగీకరించ వద్దని ఆ ఆదేశాల్లో స్పష్టం చేసింది. ఉద్యోగుల రాజీనామాతో జాతీయ ప్రాముఖ్యత కలిగిన ప్రాజెక్టులపై తీవ్ర ప్రభావం చూపుతోందని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. శాస్త్రవేత్త, ఇంజనీర్ హోదా లేదా అంతకంటే తక్కువ స్థాయిలోని సాంకేతిక సిబ్బంది నుంచి స్వీకరించిన రాజీనామాలను తమకు పంపాలని సదరు కేంద్రాలకు అంతరిక్ష విభాగం స్పష్టం చేసింది. అదికూడా ఆయా కేంద్రాల్లోని డైరెక్టర్ల స్పష్టమైన సిఫార్సులతో పంపాలని కోరింది. అయితే గ్రూప్- ఏ స్థాయిలోని ఉద్యోగుల రాజీనామాలను ఆమోదించేందుకు ఈ కేంద్రాల డైరెక్టర్లకు గతంలో ఇచ్చిన ఆదేశాలను తాజాగా అంతరిక్ష విభాగం రద్దు చేసింది.




**న్యూఢిల్లీ, సమయం ప్రతినిధి:** తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ)కి, ఆ పార్టీ అధ్యక్షురాలు మమతా బెనర్జీకి రాజ్యసభ ఎంపీ రుక్మిణి మల్లిక్ (కోయెల్ మల్లిక్) షాక్ ఇచ్చారు. టీఎంసీకి, రాజ్యసభ సభ్యత్వానికి రుక్మిణి మల్లిక్ ఇవాళ (గురువారం) రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్‌కు ఆమె సమర్పించారు. దీంతో రాజ్యసభ నుంచి వైదొలిగిన నాలుగో టీఎంసీ ఎంపీగా రుక్మిణి నిలిచారు. ఇప్పటికే ఆ పార్టీ నుంచి సుఖేందు శేఖర్ రాయ్, ప్రకాశ్ చిక్ బరైక్, సుష్మితా దేబ్ తమతమ రాజ్యసభ ఎంపీ పదవులకు రాజీనామా చేశారు. ఈ ఏడాది ఆరంభంలోనే రాజ్యసభకు రుక్మిణి మల్లిక్ ఎన్నికయ్యారు. టీఎంసీ 2026 ఫిబ్రవరి 27న రాజ్యసభ ఎన్నికలకు ఆమె అభ్యర్థిత్వాన్ని ప్రకటించింది. దీంతో ఏకగ్రీవంగా ఎన్నికై ఏప్రిల్ 6న రాజ్యసభ ఎంపీగా రుక్మిణి ప్రమాణ స్వీకారం చేశారు. ఎన్నికైన వెంటనే టీఎంసీ, మమతా బెనర్జీకి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. బెంగాల్ ప్రజలకు సేవ చేసే అవకాశం లభించడం ఎంతో గౌరవంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇది ఓ కొత్త ప్రయాణానికి ఆరంభమని, ఉత్తమంగా పని చేసేందుకు ప్రయత్నిస్తానని రుక్మిణి చెప్పుకొచ్చారు. అయితే ఎంపీగా ఎన్నికై నాలుగు నెలలు గడవక ముందే తన పదవికి ఆమె రాజీనామా చేయడం సంచలనంగా మారింది. కాగా, రుక్మిణి మల్లిక్ రాజీనామాపై టీఎంసీ, మమతా బెనర్జీ ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటనా చేయలేదు.




కేసీఆర్ హయాంలోని పదేళ్లలో ఇరిగేషన్‌పై లక్షల కోట్లు ఖర్చు చేశారని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. కమీషన్లకు కక్కుర్తి పడి నిర్మాణం చేసిన కాళేశ్వరం కూలిందని విమర్శించారు. కేసీఆర్ పాలనలో సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.లక్షా 80 వేల కోట్లు ఖర్చు పెట్టారని అన్నారు. ఈరోజు (గురువారం) భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మంత్రి ఉత్తమ్ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

**భద్రాద్రి కొత్తగూడెం, (సమయం ప్రతినిధి):** ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. గొప్పలు చెప్పుకున్న గత ప్రభుత్వం తెలంగాణ కు ఎంత నష్టం చేసిందో స్పష్టంగా కనపడుతోందని అన్నారు.


**సీతారామసాగర్ ప్రాజెక్టును పూర్తి చేస్తాం...**

సీతారామసాగర్ ప్రాజెక్టును తప్పకుండా పూర్తి చేస్తామని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గోదావరి జలాలను పారిస్తామని చెప్పుకొచ్చారు. కేసీఆర్ హయాంలో సీతారామసాగర్‌కు కనీసం ఒక్క ఎకరానికి కూడా సాగునీరు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. సీతారామసాగర్ బీఆర్ఎస్ పాలనకు నిదర్శనమని అన్నారు. కాళేశ్వరానికి మూడేళ్లలో ఎలా బీటలు వచ్చాయో చూశామని చెప్పారు. మేడిగడ్డ కూడా బీఆర్ఎస్ హయాంలోనే కూలిందని విమర్శించారు. డీపీఆర్‌లో ఉన్న ఫౌండేషన్‌ను మార్చి మరో పద్ధతిలో నిర్మించారని తెలిపారు.

**నాణ్యత లోపంతో బ్యారేజీలు నిర్మించారు..**

సుందిళ్ల ప్రతిపాదిత స్థలంలో కాకుండా మరో చోట నిర్మించారని మంత్రి ఉత్తమ్ మండిపడ్డారు. రైతుల నుంచి తాము వరి కోనుగోళ్లు చేసి నేరుగా అకౌంట్‌లో డబ్బులు వేశామని వెల్లడించారు. మూడు బ్యారేజీలు టెస్ట్ నడుస్తోందని.. లాజికల్‌గా తమ ప్రభుత్వం నడుచుకుంటుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో నాణ్యత లోపంతో బ్యారేజీలు నిర్మించారని అన్నారు. కేసీఆర్ హయాంలో లక్షల కోట్లు ఖర్చు పెట్టి ఒక్క ప్రాజెక్ట్ కూడా సరిగా ఎందుకు పూర్తి చేయలేదని నిలదీశారు. ఇరిగేషన్ వ్యవస్థను పూర్తిగా నాశనం చేసిన ఘనత కేసీఆర్ సర్కార్‌దే అని ఎద్దేవా చేశారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని ఉద్ఘాటించారు. రాష్ట్రపాలన మొత్తం ఈ జిల్లా నుంచే కొనసాగుతోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## తెలంగాణ నుంచి కర్ణాటకకు రేషన్ బియ్యం స్మగ్లింగ్.. ఐదుగురి అరెస్ట్



హైదరాబాద్, **(సమయం ప్రతినిధి):** తెలంగాణ నుంచి ఇతర రాష్ట్రాలకు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం ముఠా గుట్ట రట్టు చేశారు గచ్చిబౌలి పోలీసులు. ఈ ముఠాకు చెందిన ఐదుగురు వ్యక్తులను పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. వారి నుంచి 220 టన్నుల రేషన్ బియ్యం, 40 బ్యాగుల గోధుమలు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.4 లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ బియ్యం, గోధుమలు తరలిస్తున్న 4 లారీలు, 4 టాటా ఏస్ వాహనాలను సీజ్ చేసినట్లు చెప్పారు. నిందితులపై కంట్రోల్ యాక్ట్ - 2016 కింద కేసు నమోదు చేసినట్లు వివరించారు. గౌలిదొడ్డి నుంచి కర్ణాటకకు ఈ రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నామని పేర్కొన్నారు. నిందితులను విచారిస్తున్నామని పేర్కొన్నారు. వారి నుంచి వివరాలు రాబడుతున్నట్లు చెప్పారు. సివిల్ సప్లయ్స్ విజిలెన్స్ విభాగంలోని అధికారులతోపాటు గచ్చిబౌలి పోలీసులు సంయుక్తంగా ఈ దాడి నిర్వహించారు.

## తెలంగాణ ఎనర్జీ స్టోరేజ్ హబ్‌గా ఎదుగుతోంది: కేటీఆర్



**హైదరాబాద్ :** తెలంగాణలో ఎనర్జీ స్టోరేజ్ హబ్‌గా మార్చేందుకు కేసీఆర్ హయాంలో చేసిన తమ ప్రయత్నాలు ఫలించడం చూసి చాలా సంతోషంగా ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (KTR) వ్యాఖ్యానించారు. మహబూబ్‌నగర్‌లోని గిగా కారిడార్‌లో అమరరాజా సంస్థ 'కస్టమర్ క్వాలిఫికేషన్ ప్లాంట్' (CQP)ను ప్రారంభించిందని పేర్కొన్నారు. ఇది మహబూబ్‌నగర్‌లో ఆ సంస్థ పెట్టనున్న రూ.9,500 కోట్ల పెట్టుబడిలో కీలక మైలురాయని తెలిపారు. తాము సాధించగలిగిన అతిపెద్ద ఎనర్జీ స్టోరేజ్ (ఇంధన నిల్వ) పెట్టుబడుల్లో ఇది ఒకటని కేటీఆర్ వెల్లడించారు. వచ్చే ఏడాది ఆ కంపెనీ గిగాఫ్యాక్టరీలో వాణిజ్యపరమైన ఉత్పత్తి ప్రారంభం కావడానికి ముందే, ప్రొడక్ట్, ప్రాసెస్ క్వాలిఫికేషన్‌కు ఈ సదుపాయం వీలు కల్పిస్తుందని చెప్పుకొచ్చారు. తద్వారా బ్యాటరీ ఆర్ అండ్ డీ (పరిశోధన), కమర్షియల్ మ్యాను ఫ్యాక్చరింగ్‌కు మధ్య ఇది ఒక వారధిలా నిలుస్తుందని వివరించారు. ఇది అధునాతన ఎనర్జీ స్టోరేజ్ తయారీ హబ్‌గా తెలంగాణ స్థానాన్ని మరింత బలోపేతం చేస్తోందని మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు.

## అల్పపీడన ప్రభావంతో ఏపీలోని పలు జిల్లాల్లో వర్షాలు..!

**(సమయం ప్రతినిధి):** వాయువ్య బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న ఉత్తర ఒడిశా - పశ్చిమ బెంగాల్ తీరాల్లో స్పష్టమైన అల్పపీడనం (Well Marked Low Pressure ) కేంద్రీకృతమై ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ వెల్లడించారు. దీనితో పాటు కోస్తాంధ్ర, తెలంగాణ, మహారాష్ట్ర వరకు ద్రోణి విస్తరించి ఉందని తెలిపారు. వీటి ప్రభావంతో రాష్ట్రంలో రేపు (శుక్రవారం) ఆకాశం మేఘవృత ఉంటుందని చెప్పారు. దీనితోపాటు అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అన్నారు. శుక్రవారం(17-07-2026) శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, అనంతపురం జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వివరించింది. అలాగే మిగతా జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని ఎండీ ప్రఖర్ జైన్ పేర్కొన్నారు. గంటకు 40-50 కిమీ వేగంతో ఈదురు గాలులు వీస్తాయని తెలిపారు. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. ఈదురు గాలులు, ఉరుములతో కూడిన వర్షం పడే సమయంలో చెట్ల కింద, భారీ హోర్డింగ్స్ సమీపంలో నిలబడ వద్దని స్పష్టం చేశారు. ఈదురు గాలుల వల్ల ఎక్కడైనా విద్యుత్ వైర్లు తెగిపడి ఉంటే వాటికి వీలైనంత దూరంగా ఉండాలని ప్రజలను ప్రఖర్ జైన్ కోరారు.






**కరీంనగర్, (సమయం ప్రతినిధి):** రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన ధాన్యం పంటకు బోనస్ అందించేందుకు కొత్త నిబంధనలను విధించింది. ఈ ఏడాది ఖరీఫ్ నుంచి ప్రభుత్వం సూచించిన ధాన్యానికే బోనస్ చెల్లించనుంది. ప్రభుత్వం ఏడు రకాల వరి వంగడాలను సాగుచేయాలని సూచించింది. ఖరీఫ్ కాలంలో పండించిన ధాన్యానికి బోనస్ పొందాలంటే ప్రభుత్వం నిబంధనల మేరకు సన్న రకాల వరి పంటలను సాగు చేయాల్సి ఉంటుంది. పంట చేతికి వచ్చిన తరువాత పంట రకాన్ని బట్టి బోనస్ చెల్లిస్తారని వ్యవసాయ అధి కారులు చెబుతున్నారు. విత్తనాలను కొను గోలు చేసిన వెంటనే దుకాణదారుడు తప్పని సరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. అందుకు ప్రభుత్వం దుకాణదారుడికి డిజిటల్ లాగిన్‌ను ఇస్తుంది. ధాన్యం కొనుగోలు చేసే రైతులు వివరాలను పాస్‌బుక్ ఆధారంగా నమోదు చేస్తారు. విత్తనాల కొనుగోలు వివరాలను వ్యవసాయ శాఖ కార్యాలయానికి పంపిస్తారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసిన వివరాలను ఏఈవోలు పంటల నమోదులో సరి చూసుకుంటారు. కొనుగోలు చేసిన విత్తనాల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోతే బోనస్ వచ్చే అవకాశం ఉండదు. ప్రభుత్వం ఏడు రకాల వరి వంగడాలను పండించాలని సూచిందింది. వీటికి మాత్రమే బోనస్ చెల్లించనున్నారు. ఆర్ఎన్ఆర్ 15048, కేఎన్ఎం 1638, బీపీటీ 5204, హెచ్ఎంటీ సోనా, జై శ్రీరాం, డబ్ల్యుజీఎల్ 44 (సిద్ది), కేఎన్ఎం 7715 వరి వంగడాలను వాడాలని ప్రభుత్వం రైతులకు సూచించింది.

# సంపాదకీయం

## సమానత్వమే జగన్నాథుని మంత్రం

శ్రీ జగన్నాథుడి ప్రార్థనలు, కీర్తనలు చిన్ననాటి నుంచి నా జ్ఞాపకాల్లో పదిలమై ఉన్నాయి. పాఠశాలలో, కళాశాలలో చదువుకొనేటప్పుడు మహాప్రభు జగన్నాథుని భజన గీతాలు పాడటం నాకు చాలా ఆనందాన్నిచ్చేది. మహాప్రభుకి చాలా సన్నిహితంగా ఉన్న అనుభూతి కలిగేది. నేనీ మధ్య భజనలు పాడటం లేదు కానీ, ప్రతి రోజూ ఆ మహాప్రభుని స్మరిస్తాను. భజనలోని ఓ నాలుగు పదాలైనా పలకని రోజుండదు. నిజానికి మహాప్రభు నాకు దగ్గరగా ఉన్నట్టు భావిస్తుంటాను. కష్ట సమయాల్లో ఆయన నాకు అండగా ఉన్నారు. ఈనాటికీ భక్త కవి మధుసూదనరావు రచించిన పాటను పాడుతూనే ఉంటాను. “అంతటా ఉండే ఓ మహాప్రభూ... నువ్వు రాత్రింబగళ్లు నా తోడే ఉన్నావు... ఈ జ్ఞాపకంతో నిన్ను ఎల్లప్పుడూ పూజిస్తాను... నా పూర్ణ హృదయంతో...” అని ఆ పాటకి అర్థం. లౌకిక విషయాలు అర్థం చేసుకొనే వయసు వచ్చేనాటికి మహాప్రభు జగన్నాథుని గొప్పదనాన్ని అర్థం చేసుకోవడం ప్రారంభించాను. మహాప్రభు జగన్నాథుని గురించి ఇంట్లో తరచూ మాట్లాడుకొనేవారు. మా గ్రామంలోనూ ఇలాంటి చర్చలే ఎక్కువగా జరుగుతుండేవి. నేను గ్రామ పాఠశాలలో చదువుతున్నప్పుడు భక్త సాల్బేగ్ రచించిన ‘ఆహే నీల శైల’ అనే ప్రార్థనను క్రమం తప్పకుండా పఠించేవారు. మహాప్రభు జగన్నాథుని గురించి మా టీచర్ అనేక విషయాలు చెబుతూ ఉండేవారు. “పూరీలో పెద్ద ఆలయం ఉంది. అంతటి గొప్ప ఆలయం మరొకటి లేదు! ఆ ఆలయంలో తన చెల్లెలు సుభద్ర, సోదరుడు బలభద్రునితో కలసి మహాప్రభు పూజలందుకుంటారు. మహాప్రభు జగన్నాథుడు నల్లని రంగులో, గుండ్రని కళ్లతో ఉంటారు. సుభద్ర పసుపు రంగులో, బలభద్రుడు వెన్నెల్లో వికసించిన పుష్పంలా శ్వేతవర్ణంలో ఉంటారు. ఒక్కసారి ఆ మూర్తులను చూస్తే.. ఎప్పటికీ మరచిపోం” అని చెప్పేవారు. జగన్నాథుడే మహాప్రభువనీ, ఆయన ప్రసాదమే మహా ప్రసాదమని కూడా మా టీచర్ చెప్పేవారు. ఆయన ఆలయమే ‘బడ దేవుళ’ లేదా పెద్ద ఆలయం. ఆయన మార్గమే బడ దాండ. అంటే ఉత్కృష్ట మార్గం. ఆయన సముద్రమే మహోదధి లేదా గొప్ప మహాసముద్రం. మయూర్భంజ్ జిల్లాలోని మా ఊరు ఉపర్‌బేడా నుంచి పురుషోత్తమ క్షేత్రం– పూరీ చాలా దూరంలో ఉంటుంది. మరి పూరీని సందర్శించే అవకాశం నాకెలా వస్తుంది? నేను పెద్దయ్యాక, భువనేశ్వర్‌కి వెళ్లాను. అక్కడ బాలికల ఉన్నత పాఠశాల యూనిట్––2లో చేరాను. అక్కడే వసతిగృహంలో ఉండేదాన్ని. అక్కడ ఉన్నప్పుడే పూరీ, భువనేశ్వర్, కోణార్క్ సందర్శించే అవకాశం నాకు లభించింది. మొదటిసారి మహాప్రభును దర్శించుకున్న జ్ఞాపకం ఇప్పటికీ నా మదిలో స్పష్టంగా ఉంది. ఎంత అద్భుతమైన ఆలయం! ఎంత తేజోవంతమైన దేవతా మూర్తులు! వాటిని మరచిపోగలమా? ఎవరైనా మహాప్రభు జగన్నాథుని రథయాత్రను మరచిపోగలరా? శ్రీ క్షేత్రలో ఏడాదిలోని పన్నెండు నెలల్లో పదమూడు ఉత్సవాలు జరుగుతాయి. కానీ రథయాత్ర వైభవం మాత్రం అద్వితీయం. మహాప్రభు దర్శనం కోసం ఏడాది పొడవునా భక్తులు ఆలయాన్ని సందర్శిస్తారు. కానీ ఏడాదికోసారి మహాప్రభువే ఆలయాన్ని వదలి విశాల పథంలో గుండిచా ఆలయానికి చేరుకొని భక్తులకు దర్శనమిస్తారు. మూడు అద్భుతమైన రథాలపై.. చక్రరాజ సుదర్శనునితో పాటు.. ముగ్గురు దేవతామూర్తులు గుండిచా ఆలయానికి చేరుకుంటారు. అక్కడే ఏడు రోజులు ఉండి, ఆ తర్వాత తిరుగు ప్రయాణమవుతారు. అత్యంత వైభవోపేతమైన ఈ మహాప్రభు ఉత్సవానికి సాటి లేదు. చిన్నతనం నుంచి మహాప్రభు జగన్నాథుని భక్తురాలిని. నేను అత్యంత భక్తిభావంతో కొలిచే దైవం ఆయన. నా జీవితంలో ఒడిదొడుకులను నిర్ణయించేది ఆయనే. నా సుఖదుఃఖాలకు ఆయనే మూలం. నా జీవితంలో ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నాను. ఆ సమస్యలన్నింటి నుంచి మహాప్రభు నన్ను బయటకు తీసుకొచ్చారు. ఎంతైనా నేను ఆయన బిడ్డనే కదా. భారత రాష్ట్రపతి పదవికి నన్ను అభ్యర్థిగా ప్రకటించినప్పుడు.. నేను భక్తిపూర్వకంగా మహాప్రభుని తలచుకున్నాను. ‘నన్ను ఇంత పెద్ద స్థాయికి తీసుకెళుతున్నావు. నన్ను ముందుకు నడిపించు. ఎప్పుడూ నాతోనే ఉండు’ అని ప్రార్థించాను. ఆయన నా మొర ఆలకించారు. నా ప్రార్థనకు ఆయన ఎప్పుడూ స్పందిస్తారు. నేను రాష్ట్రపతి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తరుణంలో.. రథయాత్ర ఉత్సవం జరిగింది. నేను అప్పుడు ఢిల్లీలోనే ఉండాల్సి వచ్చింది. పూరీ వెళ్లడం సాధ్యం కాలేదు. రథయాత్ర రోజు ఉదయమే నేను ఢిల్లీలోని హాజ్‌ఖాస్‌లో ఉన్న శ్రీ జగన్నాథుని ఆలయానికి వెళ్లాను. మహాప్రభు దర్శనం చేసుకున్నాను. నా హృదయం ఆనందంతో ఉప్పొంగిపోయింది. ఆయన నాపై తన ఆశీస్సులను కురిపించారు. పూర్తి విశ్వాసంతో నేను నామినేషన్ దాఖలు చేశాను. అత్యంత ఉత్సాహంతో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నాను. 2022 జూలై 25న రాష్ట్రపతిగా ప్రమాణ స్వీకారం చేయడానికి పార్లమెంట్ సెంట్రల్ హాలుకి వెళుతూ... దారిలో నేను మహాప్రభు జగన్నాథుని స్మరిస్తూనే ఉన్నాను. ఆయన ఆశీస్సులతో, కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. రాష్ట్రపతిగా నేను మొదటిసారి ప్రసంగించినప్పుడు ఆయన నాతోనే ఉన్నట్టు అనిపించింది. అయినప్పటికీ.. మహాప్రభు దర్శనం కోసం నా హృదయం పరితపించింది. రోజులు గడచిపోతున్నాయి కానీ పూరీ వెళ్లడం సాధ్యం కాలేదు. ఆయన అనుమతిస్తేనే తప్ప ఎవరికైనా ఆయన దర్శనం ఎలా లభిస్తుందని నాకు అనిపించింది. ‘మహాప్రభూ! నేనేదైనా తప్పు చేసి ఉంటే నన్ను క్షమించండి. దయచేసి నన్ను పూరీకి పిలిచి.. మీ దర్శన భాగ్యం ఇవ్వండి’ అని మౌనంగా ప్రార్థించాను. భావాలకు లేదా భావోద్వేగాలకు కూడా ఆయనే మహాప్రభు. నా ఆలోచనలను ఆయన ఎలా అర్థం చేసుకోకుండా ఉంటారు? అనతి కాలంలోనే పూరీ పర్యటనకు షెడ్యూల్ ఖరారైంది. ఆ రోజు 2022 నవంబర్ 10. పూరీకి చేరుకున్న తర్వాత వాహన శ్రేణి శ్రీ మందిర్ దిశగా ముందుకు వెళుతోంది. పూరీలోని బడ దాండ వద్దకు చేరుకోగానే అనిర్వచనీయమైన అనుభూతి నన్ను ముంచెత్తింది. బడ దాండ శ్రీ జగన్నాథునిది. ఇక్కడ ప్రొటోకాల్ పాటించాల్సిన అవసరం ఉందా? అన్ని పుణ్యక్షేత్రాల్లోనూ క్షేత్ర రాజంగా పూరీ ప్రసిద్ధి చెందింది. దేవుళ్లకే దేవుడు మహాప్రభు. ఎలాంటి ఆలోచనలు లేకుండా నా కారుని ఆపించాను. నా కారు ఆగగానే వెనుక వస్తున్న కార్లనీ కూడా ఆగిపోయాయి. ఏం జరుగుతుందో మిగిలిన వారికి అర్థమయ్యేలోపే.. చెప్పులు లేకుండా బడ దాండపై నడవడం మొదలుపెట్టాను. అక్కడికి శ్రీ మందిర్ రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఆలయ శిఖరం మీద ఉన్న నీల చక్రం, పతిత పావన ధ్వజం మీదే నా దృష్టిని సారించి ముందుకు సాగాను. ముందుకు నడుస్తూనే.. రోడ్డుకిరువైపులా ఉన్న బాలలు, మహిళలు, యువత, పెద్దలకు నమస్కరిస్తూనే ఉన్నాను. కానీ నా దృష్టి మాత్రం మహాప్రభుమీదే ఉంది. ఆలయ సింహద్వారానికి చేరుకొనే సరికి.. నేను స్థిమితంగా ఉండలేకపోయాను. అప్పటికే నన్ను నేను మరచిపోయాను. బడ దాండ మీద దుమ్ములోనే సాష్టాంగ నమస్కారం చేసి... ఆ మహాప్రభుకి నా ప్రణామాలు అర్పించాను. ఆ తర్వాత నేను గుడిలోకి వెళ్లాను. గర్భగుడికి చేరుకొని నలుగురు దేవతామూర్తులను దర్శనం చేసుకుని, దైవికానందంతో ఉప్పొంగిపోయాను. ఈ విశ్వానికి రక్షకుడు మహాప్రభువే. అందరూ వదిలేసిన వారికి కూడా ఆయనే రక్షకుడు. లోకంలోని జనుల కష్టాలను తీర్చేందుకు ఆయన ఎల్లప్పుడూ సిద్ధంగానే ఉంటారు. అందుకే ఆయన విశాలమైన గుండ్రటి నేత్రాలు ఎప్పుడూ రెప్ప వాల్చవు. ఆయనకి పెద్దాచిన్నా తారతమ్యం లేదు. ఆయన దృష్టిలో అందరూ సమానులే. సమానత్వమే ఆయన మంత్రం. ఆయన దీవెనలతోనే.. సమాజంలోని ప్రతి వర్గానికీ సేవ చేసేందుకు నన్ను నేను అంకితం చేసుకున్నాను. గుండ్రని కన్నులతో ఉన్న మహాప్రభు జగన్నాథుని చూస్తూ.. ‘ఓ మహాబాహూ! ప్రజలకు సేవ చేయాలనే నా అంకితభావం కొనసాగేలా ఆశీర్వదించు. ఓ కృపానిధీ! నా దేశాన్ని, ఈ ప్రపంచాన్ని రక్షించు’ అని చేతులు జోడించి ప్రార్థించాను. ఇలా చెబుతూ భక్తిభావంలో లీనమైపోయాను.

# చిన్న కోతతోనే గుండె శస్త్రచికిత్స.. రోగులకు వేగవంతమైన కోలిక: డా. సత్య శ్రీధర్ కాలే




మహబూబ్‌నగర్, జూలై 16 (సమయం ప్రతినిధి): చిన్న కోత... పెద్ద విజయం..! మినిమల్లీ ఇన్వాసివ్, రోబోటిక్ కార్డియాక్ సర్జరీతో సురక్షిత చికిత్స: డా. సత్య శ్రీధర్ కాలే గుండె శస్త్రచికిత్స అంటే పెద్ద కోత, ఛాతీ ఎముకను పూర్తిగా తెరవడం, అధిక రక్తస్రావం, తీవ్రమైన నొప్పి అనే అభిప్రాయం ఇప్పటికీ చాలామందిలో ఉందని, అయితే ఆధునిక వైద్య సాంకేతికతతో ఆ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని యశోద హాస్పిటల్స్ సికింద్రాబాద్ సీనియర్ కన్సల్టెంట్ కార్డియోవాస్కులర్ అండ్ థొరాసిక్ సర్జన్ డా. సత్య శ్రీధర్ కాలే తెలిపారు. బుధవారం మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం మినిమల్లీ ఇన్వాసివ్ కార్డియాక్ సర్జరీ (ఎంఐసీఎస్), రోబోటిక్ కార్డియాక్ సర్జరీ వంటి అత్యాధునిక పద్ధతుల ద్వారా గుండె శస్త్రచికిత్సలను అత్యంత సురక్షితంగా, కచ్చితత్వంతో నిర్వహిస్తున్నామని చెప్పారు. సాంప్రదాయ ఓపెన్ హార్ట్ సర్జరీలో ఛాతీ ఎముకను పూర్తిగా తెరవాల్సి వస్తుండగా, ఎంఐసీఎస్‌లో కేవలం చిన్న కోతల ద్వారానే శస్త్రచికిత్స పూర్తి చేయవచ్చని వివరించారు. ఈ విధానంతో రక్తస్రావం, శస్త్రచికిత్స అనంతర నొప్పి, ఇన్ఫెక్షన్ ప్రమాదం తగ్గడంతో పాటు ఐసీయూ, ఆసుపత్రిలో ఉండాల్సిన రోజులు కూడా గణనీయంగా తగ్గుతాయని తెలిపారు. రోబోటిక్ సర్జరీలో అత్యాధునిక రోబోటిక్ వ్యవస్థల సహాయంతో అత్యంత సూక్ష్మమైన కదలికలను కూడా ఖచ్చితంగా నియంత్రించగలగడం వల్ల క్లిష్టమైన గుండె శస్త్రచికిత్సలను మరింత సమర్థవంతంగా నిర్వహించవచ్చని పేర్కొన్నారు. మిట్రల్ వాల్వ్, ట్రైకస్పిడ్ వాల్వ్ వ్యాధులు, గుండెలో రంధ్రాలు (ఏఎస్‌డీ), ఎంపిక చేసిన బైపాస్ శస్త్రచికిత్సలు, గుండెలోని కొన్ని కణితుల చికిత్సకు ఈ ఆధునిక విధానాలు విజయవంతంగా ఉపయోగపడుతున్నాయని తెలిపారు. శస్త్రచికిత్స అనంతరం రోగులు తక్కువ సమయంలోనే నడవడం ప్రారంభించి త్వరగా ఇంటికి వెళ్లే అవకాశం ఉంటుందని, ఉద్యోగులు, వ్యాపారులు, మహిళలు, వృద్ధులకు ఈ సాంకేతికత ఎంతో ప్రయోజనకరమని చెప్పారు. శరీరంపై పెద్ద మచ్చలు లేకపోవడం కూడా మరో ప్రధాన ప్రయోజనమన్నారు. యువతలో కూడా గుండె సంబంధిత వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో ఛాతి నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, నడిచినప్పుడు ఆయాసం, గుండెదడ, కాళ్ల వాపు వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే గుండె నిపుణులను సంప్రదించాలని డా. సత్య శ్రీధర్ కాలే సూచించారు. ప్రారంభ దశలోనే వ్యాధిని గుర్తించి చికిత్స తీసుకుంటే మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. ప్రపంచ స్థాయి వైద్య సాంకేతికత, అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, రోబోటిక్ శస్త్రచికిత్స సదుపాయాలు, అనుభవజ్ఞులైన కార్డియాక్ సర్జన్లు, కార్డియాలజిస్టులు, అనస్థీషియా నిపుణులు, ప్రత్యేక శిక్షణ పొందిన నర్సింగ్ బృందంతో యశోద హాస్పిటల్స్ సికింద్రాబాద్ యూనిట్ గుండె చికిత్సలో దేశంలోని ప్రముఖ కేంద్రాల్లో ఒకటిగా సేవలందిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యశోద హాస్పిటల్స్ మార్కెటింగ్ మేనేజర్ బి. సుదర్శన్ రెడ్డి, ఆర్. రోహిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్లను ఇబ్బందులకు గురి చేయకండి: మాజీమంత్రి





(సమయం ప్రతినిధి మహబూబ్నగర్ ): మహబూబ్ నగర్ బస్సు స్టాండ్ ముందు ఆటోలు ఆపవద్దని అధికారులు చెప్పడంతో ఆందోళన చేస్తున్న ఆటో డ్రైవర్లు పోలీస్ స్టేషన్ కు తరలించిన విషయం తెలుసుకొని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అక్కడికి వెళ్లారు. సమస్య తెలుసుకొని బస్టాండ్ వద్దకు డ్రైవర్లతో కలిసి వెళ్లి అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారం చేసారు. అధికారులు ఆటో డ్రైవర్లను ఇబ్బందులకు గురిచేయవద్దు. మహిళలకు ఉచిత బస్సు పథకంతో ఇప్పటికే ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోతున్నారు. ఆటో కార్మికులను ఆదుకుంటామని చెప్పి ప్రభుత్వం మాట తప్పిందని అన్నారు. బస్టాండ్ ముందు కొన్నేళ్లుగా ఆటో డ్రైవర్లు ప్రయాణికుల కోసం ఆటోలు అవుతున్నారని.. బస్సు లు రావడానికి..పోవడానికి ఇబ్బంది లేకుండా నిలుపుతున్నారని తెలిపారు. అధికారులు వాటిని అక్కడ ఆపడానికి అనుమతి ఇవ్వకుంటే ఆటో కార్మికుల కుటుంబాలు ఇబ్బందులు పడుతాయని అన్నారు. పిల్ల చదువులు..కుటుంబ పోషణ..రుణాల చెల్లింపులు ఉంటాయని పేర్కొన్నారు. అధికారులు మానవతా దృక్పథంతో ఆలోచన చేయాలని కోరారు. అధికారులు సూచించిన విధంగా బస్టాండ్ ముందు ఆటోలు కార్మికులు నిలుపుకుంటారని అనుమతి ఇవ్వాలని కోరారు.. క్రమపద్ధతిలో ఆటోలు నిలిపి ప్రయాణికులను తీసుకెళ్లాలని.. బస్సు లకు ఇబ్బంది కలిగించకుండా చూడాలని అధికారులు ఆటో డ్రైవర్లను కోరారు. దానికి ఆటో డ్రైవర్ లు ఒప్పుకోవడంతో ఆటోలు నిలుపుకునేందుకు అవకాశం ఇస్తామని అధికారులు తెలిపారు. సమస్య చెప్పిన వెంటనే వచ్చి పరిష్కారానికి చొరవ తీసుకున్న మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ కి ఆటో డ్రైవర్ లు కృతజ్ఞత తెలిపారు. మాజీ మంత్రి గారి వెంట గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆంజనేయులు, బీ ఆర్ ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు శివరాజ్ , సీనియర్ నాయకులూ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# న్యూజిలాండ్‌లో 6.3 తీవ్రతతో భూకంపం.. సునామీ హెచ్చరికలు జారీ..

మొదటి పేజీ తరువాయి

న్యూజిలాండ్‌లో మరోసారి భూప్రకంపనలు భయాందోళనలు రేకెత్తించాయి. దక్షిణ ద్వీపంలోని టె అనౌ పట్టణ సమీపంలో 6.3 తీవ్రతతో భూకంపం సంభవించింది. దీంతో అధికారులు సునామీ హెచ్చరికలు జారీ చేశారు. టె అనౌకు ఉత్తరాన సుమారు 40 కిలోమీటర్ల(24.85 మైళ్ల) దూరంలో భూకంప కేంద్రం ఉందని న్యూజిలాండ్ జాతీయ అత్యవసర నిర్వహణ సంస్థ తెలిపింది. యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే (USGS), జర్మన్ రీసెర్చ్ సెంటర్ ఫర్ జియోసైన్సెస్ (GFZ) మాత్రం దీని తీవ్రతను 5.9గా వెల్లడించాయి. అలాగే భూమికి 50 కిలోమీటర్లకు పైగా లోతులో భూకంపం సంభవించినట్లు నిర్ధారించాయి. కాగా, ఒక్కసారిగా భూమి కంపించడంతో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. భవనాలు ఊగిపోవడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బయటకు పరుగులు తీశారు. ఈ ఘటనలో ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించిన వివరాలను అధికారులు ఇంకా వెల్లడించలేదు. మరోవైపు సునామీ హెచ్చరికల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని ప్రజలను న్యూజిలాండ్ ప్రభుత్వం హెచ్చరించింది. ముఖ్యంగా తీర ప్రాంతాల ప్రజలు సురక్షితమైన ప్రదేశాలకు వెళ్లాలని సూచించింది. ఈ మేరకు అధికారులను కూడా అప్రమత్తం చేసింది.

## పోలేపల్లి వద్ద బిజెపి ధర్నా




దేవరకొండ: చందంపేట: జూలై 16 (సమయం ప్రతినిధి) : చంద పేట మండలం గాగిలాపురంలో గ్రామంలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ నాయకులు తంగేళ్ల రామకృష్ణారెడ్డి దాడి చేయడం ధర్నా నిర్వహించారు. బిజెపి మండల అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి మాట్లాడుతూ గాగిలాపురంలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు గురుపూజోత్సవం జరుపుతుండగా కాంగ్రెస్ నేత తంగేళ్ల రామకృష్ణారెడ్డి బూతులు తిడుతూ దాడి చేయడం ఈ దాడిఒక్క బిజెపి పైన కాదని యావత్ హిందువుల పై డాడీ అన్నారు అధికారం ఉందని ఏం చేసినా చెల్లుతుందని అనుకోదన్నారు ఈ విషయంపై పోలీసులు కేసు నమోదు చేయకపోవడంతో కాకా తిరిగి (ఆర్ ఎస్ ఎస్)కార్యకర్తల్ని భయపెట్టి కేసు వాపస్ తీసుకోవాలని భయపెట్టారని అన్నారు. ఇప్పటికైనా పోలీసులు కేసు విచారించి దాడి చేసిన వారిని శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు. బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న చేరికలు.. తెలంగాణ రాజ్యాధికార పార్టీకి పెరుగుతున్న ప్రజా మద్దతు



మేడ్చల్–మల్కాజిగిరి, జూలై 16: తెలంగాణ రాజ్యాధికార పార్టీకి రోజురోజుకూ ప్రజా మద్దతు పెరుగుతోంది. పార్టీ అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న నాయకత్వం, పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై మేడ్చల్––మల్కాజిగిరి జిల్లా బంగ్లగూడ ఆర్జీ కాలనీకి చెందిన పలువురు నాయకులు గురువారం తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో సామాజిక న్యాయం, బీసీ రాజ్యాధికార సాధనే పార్టీ లక్ష్యమని, ప్రజల కోసం పనిచేసే ప్రతి ఒక్కరికీ పార్టీలో సముచిత స్థానం ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా ఎన్. బాలకృష్ణ, పోతారం శివకుమార్, పోతారం నవీన్ కుమార్, డి. శివ, సీహెచ్. శివాజీ, దర్శనపు ప్రభాకర్ తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా యువజన అధ్యక్షుడు సింగం అరుణ్ పటేల్, జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి మహేష్ గౌడ్, మురళి పాల్గొన్నారు.

## సైబర్ బాధితులకు భారీ ఊరట.. నేరగాళ్లు కొట్టేసిన డబ్బు తిరిగి వెనక్కి..

హైదరాబాద్ : సైబర్ మోసాలకు గురై డబ్బు కోల్పోయిన బాధితులకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో శుభవార్త చెప్పింది. పోగొట్టుకున్న డబ్బును తిరిగి పొందేందుకు మనీ రిస్టోరేషన్ మాడ్యూల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. అధికారిక మెసేజ్ అందుకున్న వారు నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. బ్యాంకులు, చట్ట అమలు సంస్థల ధ్రువీకరణ తర్వాత అర్హులైన వారి ఖాతాల్లోకి నేరుగా డబ్బు జమ కానుంది. సైబర్ మోసాలకు గురై డబ్బులు పోగొట్టుకున్న వారికి తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) గుడ్‌న్యూస్ చెప్పింది. బాధితులు తమ డబ్బును సులభంగా తిరిగి పొందేందుకు మనీ రిస్టోరేషన్ మాడ్యూల్ (ఎంఆర్ఎం)ను అందుబాటులోకి తీసుకొచ్చింది.

# ఎస్సీ, ఎస్టీల సంక్షేమమే లక్ష్యం

**- వనపర్తిలో విజిలెన్స్ & మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఎంపీ డాక్టర్ మల్లు రవి**








వనపర్తి : వనపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆధ్వర్యంలో నిర్వహించిన SC & ST విజిలెన్స్ & మానిటరింగ్ కమిటీ సమావేశంలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు, టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ డాక్టర్ మల్లు రవి ముఖ్య అతిథిగా పాల్గొని సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న అట్రాసిటీ కేసుల విచారణ, బాధితులకు అందుతున్న నష్టపరిహారం, పునరావాస చర్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, చట్టాల అమలు తీరు వంటి కీలక అంశాలపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ మల్లు రవి మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి బాధితుడికి వేగంగా న్యాయం అందేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు ప్రతి అర్హ లబ్ధిదారునికి చేరేలా సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. సమాజంలోని బడుగు, బలహీన వర్గాలకు భరోసా కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని, వారి సంక్షేమం కోసం నిరంతరం కృషి కొనసాగుతుందని ఎంపీ డాక్టర్ మల్లు రవి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా SP జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# SIR విషయంలో నిర్లక్ష్యం వహించవద్దు : ప్రభుత్వ విప్





మహబూబ్ నగర్ : నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి SIR ప్రక్రియపై బిఎల్ఏలకు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, SIR విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం లేదా అలసత్వం వహించరాదని స్పష్టం చేశారు. బూత్ స్థాయిలో ఒక్క ఓటరుకూడా నష్టపోకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని, ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లకు అవసరమైన సహాయం అందించాలని ఆయన సూచించారు. "సమయం ఉంది కదా అని అలసత్వం వహిస్తే ఓట్లు కోల్పోయే ప్రమాదం ఉంది" అని హెచ్చరించారు. అత్యధిక శాతం SIR ప్రక్రియ పూర్తి చేసిన సయ్యద్ ముస్తాక్ అలిని ఆయన ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, నగర డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శులు సాయి బాబా, రాములు యాదవ్, మైనారిటీ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఫయాజ్, పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యానిర్వాహక అధ్యక్షులు అజ్మత్ అలి, యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అవేజ్ , వివిధ డివిజన్ల కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రులు పర్యటన హడావిడి మాత్రమే కానీ, అభివృద్ధికి మాత్రం నిధులు శూన్యం...



**మంత్రుల పర్యటనపై మీడియా సమావేశంలో మండిపడిన నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంచార్జి బాసు మాజీ మున్సిపల్ చైర్మన్ బీఎస్.కేశవ్**

గద్వాల : గద్వాల నియోజకవర్గానికి మంత్రులు వచ్చిపోతున్నారే తప్పా అభివృద్ధికి మాత్రం నిధులు విడుదల చేయడం లేదని బాసు హనుమంతు నాయుడు ఆరోపించారు.... ఈరోజు గద్వాల జిల్లా కేంద్రంలోని జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంత్రుల పర్యటనపై పార్టీ నాయకులతో కలిసి,బాసు హనుమంతు నాయుడు మీడియా సమావేశం నిర్వహించారు....ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గానికి మంత్రులు వచ్చినప్పుడు కాంగ్రెసులో వర్గాల హడావుడి, ఆధిపత్యల పోరు తప్పా గద్వాలకు ఒరిగిందేమీ లేదని బాసు హనుమంతు నాయుడు గారు ఆరోపించారు.... ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కనీసం నియోజకవర్గ అభివృద్ధికి నిధులు ఇవ్వకుండా మంత్రులు నియోజకవర్గంలో పర్యటించడం సిగ్గుచేటు అని అన్నారు..గద్వాల నియోజకవర్గ ప్రజలను రెండున్నర సంవత్సరాల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనూ తీవ్రంగా నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు...ట్రాన్స్ఫర్ల ఓపెనింగ్ కి వచ్చిన ఉపముఖ్యమంత్రి కనీసం మా నియోజకవర్గంలో పెండింగ్ ప్రాజెక్టులపై ఎందుకు మాట్లాడలేదని అని ప్రశ్నించారు... ట్రాన్స్ఫార్మర్లు సబ్ స్టేషన్ ఓపెనింగ్ వచ్చిన ఉపముఖ్యమంత్రి గారు గాలి మోటర్లు లో పోవడానికి టైం అయితుందని,చెప్పి,కనీసం నియోజకవర్గ అభివృద్ధి నిధులపై మరియు ప్రజల సమస్యల గురించి మాట్లాడకుండా వెళ్లిపోవడం పై నియోజకవర్గ ప్రజలపై ఎంత ప్రేమ ఉందో అర్థం అవుతుందని అన్నారు..గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన పనులే కానీ, ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి కనీసం పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేయకుండా, కాలయాపన చేస్తున్నారని అన్నారు...ప్రస్తుతం మోసపూరిత కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒక్క ట్రాన్స్ఫార్మర్ మంజూరు కావడానికి నెలలు పడుతున్నాయని రైతులు పంటలు ఎండిపోతున్న ప్రభుత్వం కనీసం పట్టించుకోవడంలేదని విమర్శించారు. ధరూర్ మండలం ర్యాలంపాడు గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఒక్క కిలోమీటర్ దూరంలో ఉన్న ర్యాలంపాడు రిజర్వాయర్ లో 4 టీఎంసీల సామర్థ్య ఉన్న ప్రాజెక్ట్ లీకేజీ ప్రాబ్లం ఉన్నది అని 2 టీఎంసీల కు కుదించిన విషయం తెలిసికూడా సందర్శించకపోవడం పై మండిపడ్డారు. మొన్న ధరూర్ మండల కేంద్రంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సభలో మీ మోసపూరిత కాంగ్రెస్ ప్రభుత్వ పాలన పై సభకు వచ్చిన మహిళలు తిరుగుబాటే మీ ప్రభుత్వ పాలన నిదర్శనం అని అన్నారు..ఈ కార్యక్రమంలో జి.రాఘవేంద్ర రెడ్డి, కౌన్సిలర్లు పులిపాటి వెంకటేష్, చంటన్న, గువ్వల గోపాల్,మోహన్ యాదవ్,చిత్తరి కిరణ్,కమ్మరి రాము,చక్రీధర్ రెడ్డి,బీచుపల్లి,వెంకటేష్ యాదవ్, తిమ్మప్ప గౌడ్,శ్రీరాములు, పూడూరు రఘు నాయుడు,గంజిపేట అరవింద్, మాలిక్, రాము, లోకేష్, భాస్కర్, జగదీష్, నరసింహులు, గోవిందు, వీరేష్, రాజు, మహేష్, కృష్ణ, మహేందర్, నరేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రంతో సయోధ్యకి రేవంత్

హైదరాబాద్ : రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరనేది పాత సామెత. కానీ, కేంద్రంలో ఒక పార్టీ, రాష్ట్రంలో మరో పార్టీ అధికారంలో ఉంటే.. నిత్యం కత్తులు దూసుకోవడం, సవాళ్లు విసురుకోవడం భారత రాజకీయంలో మనం తరచూ చూసే నిత్యకృత్యం. ముఖ్యంగా కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత, కాంగ్రెస్ లేదా ఇతర ప్రతిపక్షాలు పాలించే రాష్ట్రాల మధ్య నిరంతరం ఘర్షణ వాతావరణమే కనిపించేది. గతంలో తెలంగాణలోనూ ఇదే తరహా 'ఢీ అంటే ఢీ' అనే రాజకీయాలు నడిచాయి. అయితే, రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పాత పంథాకు పూర్తిగా స్వస్తి పలికింది. కేంద్రంతో సఖ్యతగా ఉంటూనే రాష్ట్ర ప్రయోజనాలను సాధించుకోవచ్చనే సరికొత్త రాజకీయ ఒరవడికి రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు.ఎన్నికల రణక్షేత్రంలో విమర్శలు, ప్రతివిమర్శలు సహజం. కానీ, ఎన్నికలు ముగిసి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా అదే రాజకీయ వైరాన్ని కొనసాగిస్తే నష్టపోయేది రాష్ట్ర అభివృద్ధి, ప్రజలేనని రేవంత్ సర్కార్ బలంగా నమ్ముతోంది. అందుకే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతో నిత్యం తలపడే ధోరణిని పక్కనబెట్టి, సామరస్య పూర్వక వైఖరిని అవలంబిస్తోంది. రాష్ట్ర ప్రయోజనాలే పరమావధిగా రేవంత్ రెడ్డి అడుగులు వేస్తున్నారు.ఢిల్లీ వెళ్లిన ప్రతిసారీ కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా.. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా సహా పలువురు కేంద్ర మంత్రులను రేవంత్ రెడ్డి వరుసగా కలుస్తున్నారు. రాష్ట్రానికి రావలసిన నిధులు, పెండింగ్ ప్రాజెక్టులు, విభజన చట్టం హామీలను వారికి వివరంగా వివరిస్తున్నారు. కేంద్రం నుంచి ఆమోద ముద్ర పొందేలా చాకచక్యంగా వ్యవహరిస్తున్నారు. ఇందుకోసం అవసరమైతే రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలను సైతం కలుపుకుంటూ, వారి ద్వారా కూడా ఒత్తిడి తెచ్చే వ్యూహాత్మక పంథాను అనుసరిస్తున్నారు.ఈ క్రమంలోనే ప్రధానమంత్రి నరేంద్ర మోడీని రేవంత్ రెడ్డి పలు సందర్భాల్లో 'పెద్దన్న' అని సంబోధించడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ ముఖ్యమంత్రి అయ్యి ఉండి మోడీని అలా కొనియాడడం వెనుక రాజకీయ వ్యూహాలు ఉన్నాయనే ప్రచారం జరిగింది. అయితే దీనిపై రేవంత్ రెడ్డి అత్యంత స్పష్టతతో సమాధానమిచ్చారు. దేశంలోని అన్ని రాష్ట్రాలకూ ప్రధానే పెద్ద దిక్కు కాబట్టి, ఆ కోణంలోనే తాను 'పెద్దన్న' అన్నానని, అంతేకానీ రాష్ట్ర ప్రయోజనాల విషయంలో తానేనాడూ రాజీ పడబోనని కుండబద్దలు కొట్టారు. అవసరమైనప్పుడు హక్కుల కోసం కొట్లాడతామని, మిగిలిన సమయంలో అభివృద్ధి కోసం కలిసి పనిచేస్తామని స్పష్టం చేశారు.మరోవైపు రేవంత్ రెడ్డి పనితీరు, ఆయన అనుసరిస్తున్న విధానాల పట్ల ప్రధాని మోడీ కూడా సానుకూల వైఖరితోనే ఉన్నట్లు కనిపిస్తోంది. "తనతో కలిసి పనిచేసి చూడు.. రాష్ట్రాన్ని ఎక్కడికో తీసుకెళ్తాం" అంటూ మోడీ బహిరంగంగానే రేవంత్‌కు పిలుపునివ్వడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

# ఆర్ఎస్ఎస్ కార్యకర్తపై కాంగ్రెస్ నాయకులు దాడి విషయంలో స్పందించిన ఎస్ఐ

దేవరకొండ: చందంపేట: జూలై 16 (సమయం ప్రతినిధి) : చందంపేట మండలం గాగిలాపురంలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు గురుపూజోత్సవం జరుపుతుండగా అదే గ్రామానికి చెందిన కొందరు కాంగ్రెస్ నాయకులు ఆర్ఎస్ఎస్ కార్యకర్తలపై దాడి చేశారు ఈ విషయంపై చందంపేట సబ్ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ. తేదీ 12/7/2026 రాత్రి సుమారు 9 గంటల ప్రాంతంలో గాగిల్లపురం గ్రామం, చందంపేట మండలంలోని ఆంజనేయస్వామి టెంపుల్ ఆవరణలో కొంతమంది ఆర్ఎస్ఎస్ మరియు బిజెపి వాళ్లు గురుపూజోత్సవం సందర్భంగా కార్యక్రమం నిర్వహించుకొనుచుండగా అదే గ్రామానికి చెందిన తంగెళ్ల రామకృష్ణారెడ్డి, వినోద ఆచార్య మీద చేయి చేసుకొని, బూతులు తిట్టడం జరిగినది. అట్టి విషయంలో దరఖాస్తు రాగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించనైనది.తప్పు చేసిన వారిపై తగిన చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయి. అని ఎస్ఐ అన్నారు.

# సౌత్ ఇండియాస్ లార్జెస్ట్ CSR సమ్మిట్ 2026కు గెస్ట్ ఆఫ్ ఆనర్‌గా ఎమ్మెల్యే కు ఆహ్వానం



మహబూబ్ నగర్ : నియోజకవర్గ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి కి సౌత్ ఇండియాస్ లార్జెస్ట్ CSR సమ్మిట్ 2026కు గెస్ట్ ఆఫ్ ఆనర్‌గా పాల్గొనాలని ఆహ్వానం అందింది. హైదరాబాద్‌లో జూలై 25, 2026 (శనివారం) ఉదయం 9:00 గంటల నుంచి సాయంత్రం 6:30 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రతిష్టాత్మక సమ్మిట్‌కు సంబంధించి నిర్వాహకులు అధికారికంగా ఆహ్వాన పత్రాన్ని ఎమ్మెల్యే గారికి అందజేశారు. కార్పొరేట్, ప్రభుత్వ, సామాజిక సేవా రంగాల ప్రముఖులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, సామా జిక అభివృద్ధి కోసం భాగస్వామ్యాలను పెంపొందించడం ఈ సమ్మిట్ ముఖ్య ఉద్దేశంగా నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో 300కి పైగా కార్పొరేట్ ప్రతినిధులు, 1200కి పైగా స్వచ్ఛంద సంస్థలు, 100కి పైగా సామాజిక వ్యాపారవేత్తలు పాల్గొననుండగా, వివిధ రంగాలకు చెందిన 8 మంది ప్రముఖులు కీలక ప్రసంగాలు చేయనున్నారు, వారిలో యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఒకరు. విద్య పైన ఆయన ప్రసంగం చేయనున్నారు. ముఖ్యంగా మహబూబ్ నగర్ నియోజకవర్గంలో వారు అమలు చేస్తున్న ఎడ్యుకేషన్ మాడల్ ను తన ప్రసంగంలో వివరించనున్నారు. అలాగే వివిధ అంశాలపై చర్చలు, సామాజిక సేవలో విశిష్ట సేవలందించిన వారికి సత్కారాలు కూడా నిర్వహించనున్నారు. ఈ సమ్మిట్‌లో గెస్ట్ ఆఫ్ ఆనర్‌గా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పాల్గొనడం కార్యక్రమానికి మరింత గౌరవాన్ని తీసుకువస్తుందని నిర్వాహకులు పేర్కొన్నారు. మహబూబ్ నగర్ అభివృద్ధికి ఆయన చేస్తున్న సేవలు, ప్రజా సేవ పట్ల ఆయన కట్టుబాటు దృష్ట్యా ఈ ఆహ్వానం అందజేసినట్లు తెలిపారు.

# ఆగష్టు 10న జరుగు జైలు భరో కార్యక్రమం ను విజయవంతం చేయండి



ఆత్మకూరు : తెలంగాణ వ్యవసాయకార్మిక సంఘశీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్. వనపర్తి జిల్లా కేంద్రం లోని సి ఐ టి.యు కార్యాలయం లొ జరిగిన సి ఐ టీ యు. వ్యవసాయకార్మిక సంఘశీ. రైతు సంఘాల సంయుక్త జిల్లా సదస్సు గురువారం నాడు..సి ఐ టీ యు జిల్లా అధ్యక్షులు ఆర్ ఎన్ రమేష్. యూ వ్యకస జిల్లా అధ్యక్షులు యస్. అజయ్..రైతుసంఘశీ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేశ్వర చారి ల అధ్యక్షతన జిల్లా సదస్సు జరిగింది దీనికి ముఖ్యవక్తగా బుర్రి ప్రసాద్ హాజరు అయ్యి మాట్లాడుతు.29కార్మిక చట్టాలని 4.లేబర్ కోడ్ లు గా మర్చి కార్మిక చట్టాలను నిర్వీర్యం బీజేపీ చేసిందని విమర్శించారు. స్మార్ట్ మీటర్ల పేరుతొ రైతు డిస్కమ్ లు ఏర్పాటు చేసి రైతుల మోటార్లకు స్మార్ట్ మీటర్స్ పెట్టె దుర్మార్గవిధానశీ కు వ్యతిరేకం గా పోరాడాలని పిలుపు నీచ్చారు. –మహాత్మా ఉపాధి హామీ పేరు మర్చి వీబిజి రాంజీ పేరు పెట్టీ జులై 1నుండి కొత్త చట్టం పేరుతొ అమలు చేయడం దారుణమాని దుయ్యాబట్టారు. కేంద్రం 90%నిధుల నుండి 60%కి తగ్గించారని రాష్టాలు 10%భరించే నిధులను 40%కి పెంచి రాష్ట్ర లపై పెను భారం మోపడం తో రాబోయే రోజుల్లో ఉపాధి పతకం ను రద్దు చేసేందుకు బిజెపి కుటిల ప్రయత్నాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఈ విధానాలకు వ్యతిరేంకంగామండలగ్రామ స్థాయి లల్లో రౌండ్ టేబుల్ సమావేశాలు. సదస్సు లు ఏర్పాటు చేయాలనీ తీర్మానం చెశారు ఆగష్టు 10న జిల్లా కేంద్రా లల్లో జరుగు జైలు భరో కార్యక్రమం లొ రైతులు కార్మికులు కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలనీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లొ సి ఐ టియు జిల్లా ప్రధాన కార్యదర్శి మండ్ల రాజు. యూ వ్యకస జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల ఆంజనేయులు.. యస్. రాజు నిక్సన్.బాలగౌడ్ ముత్యాలు. తిరుపతయ్య.మండ్ల బాలస్వామి. డి. కుర్మయ్య. నందిమల్ల రాములు.వి. కృష్ణయ్య.మండ్ల సత్య నారాయణ బుచ్చమ్మ. బిసన్న తదితరులు పాల్గొన్నారు.

# కేరళ రేంజ్ లో ఏపీలో ఆ 23 గ్రామాలు..!

విశాఖపట్టణం : ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ శాఖ పాలనలో సరికొత్త మైలురాయిని అందుకుంది. రాష్ట్రంలోని 23 గ్రామ పంచాయతీలు తమ అద్భుతమైన సేవలు, పారదర్శక విధానాలకు గానూ ప్రతిష్టాత్మక అంతర్జాతీయ ఐఎస్ఓ గుర్తింపును సొంతం చేసుకున్నాయి. స్థానిక సంస్థల పరిధిలో ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఈ విజయంతో సత్ఫలితాలను ఇచ్చాయని స్పష్టమవుతోంది.గ్రామ పంచాయతీల పరిధిలో ప్రభుత్వ రికార్డులను పక్కాగా నిర్వహించడం, ప్రజలకు కావాల్సిన వివిధ రకాల ధృవపత్రాలను (సర్టిఫికెట్లు) ఎలాంటి ఆలస్యం లేకుండా త్వరితగతిన జారీ చేయడంలో ఈ 23 పంచాయతీలు విశేష ప్రతిభ కనబరిచాయి.

# కనుల పండుగగా జగన్నాథ రథయాత్ర

## ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే











మహబూబ్ నగర్ : మహబూబ్ నగర్ నగరంలో జగన్నాథ రథయాత్ర కనుల పండుగగా వైభవంగా జరిగింది. ఇట్టి రథోత్సవానికి గౌరవ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మహబూబ్ నగర్ ఎంపి శ్రీమతి డికె అరుణ తో కలిసి ముఖ్య అతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, రథాన్ని లాగారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీ జగన్నాథ స్వామి, బలభద్రుడు, సుభద్రమ్మలతో కూడిన రథయాత్ర ప్రతి సంవత్సరం ఎంతో భక్తి శ్రద్ధలతో, పూరిలో నగరంలో జరుగుతుంది. అదే జగన్నాథ రథయాత్రలో, ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తులు తరలివచ్చి దర్శనం చేసుకుంటారని, అదే స్ఫూర్తితో దేశవ్యాప్తంగా అనేక పట్టణాలలో కూడా రథయాత్రలు నిర్వహించడం ఆనందదాయకమని ఆయన అన్నారు. మన పట్టణంలో కూడా గత కొన్ని సంవత్సరాలుగా రథయాత్రను ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నారని తెలిపారు. ఈ సంవత్సరం నిర్వహించిన రథయాత్రలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారని ఆయన అభినందించారు. జగన్నాథుని ఆశీస్సులు అందరికీ కలగాలని, మంచి వర్షాలు కురిసి రాష్ట్రంలోని రైతులకు మంచి పంటలు పండాలని, ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మద్ది యాదిరెడ్డి, ఇస్కాన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ఫారాల సేకరణ, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి





**-విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలి.**
**-అదనపు కలెక్టర్ వినోద్ కుమార్.**

వనపర్తి. సమయం ప్రతినిధి : వనపర్తి మండలంలోని చిట్యాల, చిమనగుంటపల్లి గ్రామాల్లో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (SIR) కార్యక్రమంలో ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ, ఆన్‌లైన్ డేటా నమోదు ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం చిన్నగుంటపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ బూత్ లెవల్ అధికారులు (BLO\T) ఇంటింటికి వెళ్లి అర్హులైన ప్రతి ఓటరికి ఎన్యూమరేషన్ ఫారాలు అందజేసి, పూర్తి చేసిన ఫారాలను త్వరితగతిన సేకరించాలని ఆదేశించారు. సేకరించిన ఫారాల వివరాలను రోజువారీగా ఆలస్యం లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేసి, పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫారాలు నింపడంలో ప్రజలకు ఎదురయ్యే సందేహాలను బీఎల్ఓలు నివృత్తి చేసి, అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని తెలిపారు. నిర్దేశించిన గడువులోగా లక్ష్యాలను పూర్తి చేసేందుకు గ్రామపంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. పాఠశాల ఆకస్మిక తనిఖీ అనంతరం చిమనగుంటపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించిన అదనపు కలెక్టర్ తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి విద్యాభ్యాసం, పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. పాఠశాలలో అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత, రుచి, మెనూ అమలుపై విద్యార్థులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. వనపర్తి తహసీల్దార్ రమేష్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, బూత్ లెవల్ అధికారులు (BLO\T), రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ రికవరీ యాక్ట్‌ను ఎత్తివేయాలి



దేవరకొండ జూలై 16 (సమయం ప్రతినిధి) : దేవరకొండ పట్టణంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ అమరవీరుల స్థూపం ముందు విద్యార్థులతో కలిసి నల్ల బ్యాడ్జీలు ధరించి మౌన దీక్ష తో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సామాజికవేత్త, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులపై రెవెన్యూ రికవరీ యాక్టును ఎత్తివేయాలని, జీవో నెంబర్ 9 ను వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫీజులు కట్టలేక సీట్లను విద్యార్థులు వదులుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ద ఎత్తున నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. విద్యాశాఖ పై అఖిలపక్ష సమావేశం నిర్వహించి విద్యార్థులకు న్యాయం చేయాలని, విద్యార్థులపై చిన్న చూపు చూడకుండా ఫీజ్ రియంబర్స్మెంట్ విడుదలను తీవ్ర నిర్లక్ష్యం వహించరాదన్నారు. 14 లక్షల మంది విద్యార్థుల భవిత అంధకారంగా మారే ప్రమాదం ఉందని, ప్రభుత్వం ఫీజు రియంబర్స్మెంట్ పథకంపై పూటకో మాట మాట్లాడుతుందని బకాయిలు చెల్లించని యెడల ఎమ్మెల్యేల ఇల్లు ముట్టడిస్తామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డి కోటేశ్వరరావు, భీమగోని శివ గౌడ్, సొల్లేటి భాస్కరాచారి, పున్న బిక్షమయ్య, మునగాల గణేష్, కాటం వెంకటేష్ గౌడ్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లపై విజిలెన్స్ అధికారుల విచారణ

### .. డబ్బులు ఎవరు అడగలేదని విచారణలో తేల్చి చెప్పిన లబ్ధిదారులు



అమరచింత : వనపర్తి జిల్లా అమరచింత మండలం పామిరెడ్డి పల్లి గ్రామంలో గురువారం రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ విజిలెన్స్ అధికారి బాల్ రామ్ వనపర్తి జిల్లా పిడి , ఎంపీఓ, ఏయి లతో కలిసిన బృందం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో 50 వేల లంచం అడిగిన విషయంపై విచారణ చేశారు, గ్రామంలోని లబ్ధిదారుల ఇండ్లకు వెళ్లి విచారణ చేయగా ఎవరు కూడా తమకు లంచం అడగలేదని ఎవరికీ డబ్బులు ఇవ్వలేదని బాధితులు అధికారులకు తేల్చి చెప్పారు దీంతో విజిలెన్స్ అధికారులు మాట్లాడుతూ ఇంటి బిల్లు విషయంలో లంచం అడిగినట్టు ఎలాంటి ఆధారాలు లేవని, ఆరోపణలు నిజం లేదని అధికారులు తేల్చి చెప్పారు.

## దేవరకొండ అభివృద్ధికి మరో ముందడుగు - నూతన ప్రభుత్వ భవనాల నిర్మాణానికి స్థల పరిశీలన చేసిన ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్



దేవరకొండ, జూలై 16:(సమయం ప్రతినిధి) : దేవరకొండ పట్టణ అభివృద్ధికి మరో కీలక అడుగు పడింది. పట్టణంలో నూతనంగా నిర్మించనున్న ప్రభుత్వ కార్యాలయాల కోసం దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ సంబంధిత అధికారులతో కలిసి పలు ప్రాంతాల్లో స్థల పరిశీలన నిర్వహించారు. ముందుగా నూతన సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం నిర్మాణం కోసం ఖిల్లా బజార్‌లోని (పాత బజార్) పాత పోలీస్ స్టేషన్ స్థలాన్ని, అలాగే బీఎస్ఎన్ఎల్ కార్యాలయం పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించి, నిర్మాణానికి అనువైన ప్రాంతాలపై అధికారులతో చర్చించారు. అనంతరం పట్టణంలోని ఎమ్మార్వో (తహసీల్దార్) కార్యాలయం ప్రాంగణంలో ఉన్న ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. అక్కడ నూతన తహసీల్దార్ కార్యాలయ భవనం నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు, అవసరమైన స్థలం, సౌకర్యాలపై ఎమ్మార్వోతో పాటు సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ మాట్లాడుతూ, దేవరకొండ పట్టణంలోని పాత బజారుకు కొత్త కలను సాకారం చేస్తూ, ప్రజలకు మెరుగైన ప్రభుత్వ సేవలు అందించే విధంగా ఆధునిక వసతులతో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి కృషి చేస్తున్నాం అని తెలిపారు. నూతన తహసీల్దార్ (ఎమ్మార్వో) కార్యాలయ భవనం నిర్మాణానికి రూ.2 కోట్ల 25 లక్షలు అలాగే మున్సిపల్ కార్యాలయ నూతన భవనం నిర్మాణానికి రూ.7 కోట్ల 60 లక్షలుమంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ భవనాల నిర్మాణంతో దేవరకొండ పట్టణంలో ప్రభుత్వ సేవలు మరింత సమర్థవంతంగా, ప్రజలకు అందుబాటులోకి వస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ స్థల పరిశీలనలో ఎమ్మార్వో, మున్సిపల్ అధికారులు, రెవెన్యూ శాఖ అధికారులు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణ సాంస్కృతిక పండుగ కుమ్మర్ల తొలి బోనం




-మట్టి కుండల ప్రాధాన్యత
కుమ్మర్ల తొలి బోనం.... శ్రీ శ్రీ శ్రీ కనకాల కట్ట మైసమ్మ.
-బోనాల పండుగలో భాగమైన కుమ్మర్ల పాత్ర అత్యంత ప్రాచీనమైనది, విశిష్టమైనది.
-వనపర్తి జిల్లా కుమ్మరి సంఘం నాయకులు





వనపర్తి, సమయం ప్రతినిది,జులై 16: తెలంగాణ రాష్ట్రంలో ఆషాఢమాసంలో జరుపుకునే పండుగ కుమ్మర్ల తొలి బోనం... తెలంగాణ రాష్ట్ర కుమ్మరి సంఘం అధ్యక్షులు నడికుడి జయంతి రావు పిలుపు మేరకు గురువారం ట్యాంక్ బండ్ శ్రీశ్రీ శ్రీ కనకాల కట్ట మైసమ్మ దేవాలయం అమ్మవారి తొలి బోనం పూజ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కుమ్మరి సంఘం నాయకులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు,తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా వనపర్తిజిల్లా కుమ్మరి సంఘం నాయకులు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో ఆషాఢమాసంలో జరుపుకునే పండుగ కుమ్మర్ల తొలి బోనం.. భోజనమే... బోనం! మహిళలు.. అట్టహాసంగా లష్కర్ బోనాలు.. తొలి బోనం సమర్పించి తెల్లవారుజాము నుంచే అమ్మవారి ఆలయానికి భక్తులు క్యూ కడతారన్నారు. కుమ్మరి కులస్తులు తయారుచేసిన మట్టి కుండ (బోనం)లోనే అమ్మవారికి నైవేద్యం వండటం, కుమ్మరి మహిళలే తొలి బోనాన్ని సమర్పించడం అనాదిగా వస్తున్న సంప్రదాయమే.. కుమ్మర్ల తొలి బోనం అన్నారు. కుమ్మర్ల తొలి బోనం విశిష్టతకు చాలా ఆదారణ ఉందన్నారు.

**మట్టి కుండల ప్రాధాన్యత:**

బోనాలు అనగానే మట్టి కుండలు గుర్తుకొస్తాయి. కుమ్మరులు ఎంతో భక్తిశ్రద్ధలతో, పవిత్రంగా,ప్రత్యేక కుండలను తయారుచేస్తారన్నారు. తొలి ప్రాధాన్యత: బోనాల ఉత్సవాలు ప్రారంభమయ్యేది. వేప ఆకులు,పసుపు, కుంకుమ, వెలిగించిన దీపం అలంకరించబడిన కుండల్లోనే కొత్త బియ్యం, పాలు,బెల్లం వేసి నైవేద్యం వండి తొలి రోజుల్లో, కుమ్మరి సంఘం మహిళలు తయారుచేసిన తొలి బోనాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి,అమ్మవారికి సమర్పిస్తారన్నారు.గ్రామ దేవతలకు (పోచమ్మ, ఎల్లమ్మ) ఆనవాయితీగా సమర్పిస్తారు. చారిత్రక నేపథ్యం: కుమ్మరి వృత్తి. వనపర్తి కుమ్మరి సంఘం నాయకులు.తెలంగాణ గ్రామ దేవతల సంస్కృతితో ముడిపడి ఉంది. ఆదిశక్తికి సమర్పించే ఈ నైవేద్యంలో మట్టి కుండ వాడటం ప్రకృతికి, సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తుంది.

**ఆచారాలు**

ఈ తొలి బోనం సందర్భంగా కుమ్మరి కుటుంబాల సభ్యులు,గ్రామ పెద్దలు కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి,మొక్కులు చెల్లించుకుంటారు.ఈ బోనాల పండుగలో భాగమైన కుమ్మర్ల పాత్ర మన పూర్వీకుల జీవన విధానాన్ని, కులవృత్తుల గొప్పతనాన్ని చెప్పటానికి ఇదే నిదర్శనం అన్నారు.

**గోల్కొండ, లష్కర్ బోనాల**

తయారీ విధానం,చాలా గొప్పగా ఉంటుందని కొనియాడారు. బోనాలు అమ్మవారిని పూజించే హిందువుల పండుగ. చెప్పుకోవచ్చు తెలిపారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కుమ్మరి సంఘం నాయకులు పాల్గొన్నారు.

## వైరల్ ఫీవర్ తో బాధపడుతూ... సమస్యలను పరిష్కరించిన మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి



మక్తల్ : హైదరాబాద్ లోని మినిస్టర్స్ క్వార్టర్స్ లో మక్తల్ నియోజకవర్గంలోనీ నందిమల్ల, ముల్లమల్ల గ్రామాల రైతులు జూరాల ఎడమ కాలువ (Left Canal) నుండి చెరకు, పామ్ ఆయిల్ పంటలతో పాటు పశువుల తాగునీటి అవసరాల దృష్ట్యా కొంత మేర సాగునీటిని విడుదల చేయాలని రాష్ట్ర మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరిని కలిసి వినతిపత్రం సమర్పించి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, నీటి విడుదల వల్ల పంటలను కాపాడుకోవడంతో పాటు పశువులకు కూడా తాగునీటి సమస్య తీరుతుందని వివరించారు. రైతుల సమస్యను మంత్రి సానుకూలంగా విని, సంబంధిత అధికారులతో మాట్లాడి రైతులకు అవసరంమేరకు నీరు వదిలేలా సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గీత పారిశ్రామిక సహకార సంస్థ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ కేశం నాగరాజు గౌడ్ ,అమరచింత మండల అధ్యక్షులు రాజేందర్ రెడ్డి నందిమల్ల, ముల్లమల్ల గ్రామాల రైతులు వివిధ పార్టీల అధ్యక్షులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నాగర్ దొడ్డి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు యూనిఫామ్‌లు పంపిణీ చేసిన గ్రామ సర్పంచ్ వెంకటేశ్వరమ్మ



సమయం ప్రతినిధి: జోగులాంబ గద్వాల జిల్లా జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలంలోని నాగర్ దొడ్డి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్న పిల్లలకు ప్రభుత్వం అందించిన ఉచిత యూని ఫామ్‌లు (దుస్తుల) పంపిణీ చేసిన గ్రామ గ్రామ సర్పంచ్ వెంకటేశ్వరమ్మ సత్యన్నా గ్రామ సర్పంచ్ వెంకటేశ్వరమ్మ గారు మాట్లాడుతూ గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరు మీ చిన్నారులను అంగన్వాడి సెంటర్కు పంపించాలి అంగన్వాడీ సెంటర్లో ఇచ్చే పౌష్టికాహారని మహిళలందరూ తీసుకోవాలని గ్రామ సర్పంచ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, మరి వాడు నెంబర్స్ , అంగనవాడి టీచర్ వనజాక్షి, అంగన్వాడి ఆయలు పిల్లల తల్లిదండ్రులు బెన్ఫిషర్స్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## విద్యార్థుల భద్రతే లక్ష్యం అవగాహనే అత్యుత్తమ రక్షణ ఏహెచ్‌టీయూ ఎస్సై: అంజద్

సోషల్ మీడియా భద్రత నుంచి బాలల హక్కుల వరకు విస్తృత అవగాహన
బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ,మానవ అక్రమ రవాణ సైబర్ మోసాలపై అవగాహన



వనపర్తి : విద్యార్థులు చట్టాలపై అవగాహనతో పాటు అప్రమత్తత పెంపొందించుకుని తమ భద్రతను తామే కాపాడుకోవాలని ఏహెచ్‌టీయూ ఎస్సై అంజద్ అన్నారు గురువారం కొత్తకోట మండల కేంద్రంలో జిల్లా ఎస్పీ శ్రీమతి సునిత రెడ్డి, ఆదేశాల మేరకు, వనపర్తి ఏహెచ్‌టీయూ ఎస్సై అంజద్ ఆధ్వర్యంలో వనపర్తి షీ టీమ్, ఏహెచ్‌టీయూ, భరోసా సెంటర్ సంయుక్తంగా కొత్తకోట ఈ–పబ్లిక్ స్కూల్లో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు షీ టీమ్ సేవలు, ఈవ్‌టీజింగ్‌పై వెంటనే ఫిర్యాదు చేసే విధానం, టీ–సేఫ్ వినియోగం, మహిళల సహాయ కేంద్రాలు, అత్యవసర సహాయ వ్యవస్థ (Emergency Response Support System), మానవ అక్రమ రవాణా నివారణ, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, వెట్టి చాకిరీ నిర్మూలన వంటి అంశాలపై సమగ్రంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సైమాట్లాడుతూ.. విద్యార్థుల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత. చట్టాలపై అవగాహన, సాంకేతిక పరిజ్ఞానంపై జాగ్రత్త, సమయానికి పోలీసులను ఆశ్రయించే అలవాటు ఉంటే అనేక నేరాలను ముందుగానే అరికట్టవచ్చు. ఎలాంటి వేధింపులు, అనుమానాస్పద సంఘటనలు, సైబర్ మోసాలు ఎదురైనా వెంటనే షీ టీమ్ లేదా సమీప పోలీసు అధికారులను సంప్రదించి సహాయం పొందాలి. అప్రమత్తతే భద్రతకు తొలి అడుగన్నారు. నేటి డిజిటల్ యుగంలో విద్యార్థులు వ్యక్తిగత సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దని, సోషల్ మీడియా ద్వారా సైబర్ నేరగాళ్లు చిన్నారులను ఎలా లక్ష్యంగా చేసుకుంటారో వివరించారు. అపరిచితుల లింకులు, సందేశాలు, ఆన్‌లైన్ గేమ్స్, నకిలీ ఖాతాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సోషల్ మీడియా వినియోగంలో పాటించాల్సిన భద్రతా చర్యలు, సైబర్ మోసాల నుంచి రక్షణ పొందే మార్గాలను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపధ్యాయులు, విద్యార్థినవిద్యార్థులు,షీ టీమ్, ఏహెచ్‌టీయూ, భరోస సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హరీష్ వ్యూహాత్మక మౌనమేనా

హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాల్లో ఏ క్షణంలోనైనా తనే ముందుండి ప్రత్యర్థులపై వ్యతిరేక దాడి చేయడమే తప్ప, ఎప్పుడూ రక్షణాత్మక ధోరణిలో రాజకీయాలు చేసే అలవాటు లేని బలమైన నాయకుడు తన్నీరు హరీష్ రావు దీనికి ప్రధాన కారణం సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ఆయనపై పెద్దగా అవినీతి మరకలు లేకపోవడమే. గతంలో ఆయనపై వచ్చిన విమర్శలన్నీ కేవలం రాజకీయ కోణంలో చేసినవే తప్ప, పక్కా ఆధారాలతో ఆయన్ను ఇరకాటంలో పెట్టే స్థాయి ఆరోపణలు ఇప్పటి వరకు రాలేదు. కానీ, ప్రస్తుతం హరీష్ రావు తన రాజకీయ జీవితంలోనే మొదటిసారిగా సమాధానం చెప్పుకోవాల్సిన సంకట స్థితిలో పడ్డారు. ఈ వివాదానికి కేంద్ర బిందువు హరీష్ రావు సతీమణి యాజమాన్యంలోని మిల్చీ మిల్క్ డైరీ బ్రాండ్. ఈ కంపెనీ మార్కెట్‌లో సాధారణ ప్రజలకు పంపిణీ చేసే వాటా చాలా పరిమితంగా ఉన్నప్పటికీ.. హైదరాబాద్‌లోని బడా కార్పొరేట్ ఆసుపత్రులు, ప్రముఖ విద్యాసంస్థలు , కాలేజీలకే అత్యధికంగా పాలను సరఫరా చేస్తుందనే ప్రచారం సాగుతోంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అధికార బలాన్ని ఉపయోగించి, సదరు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కార్పొరేట్ విద్యాసంస్థలను, ఆసుపత్రులను బెదిరించి బలవంతంగా ఈ బ్రాండ్ పాలను కొనుగోలు చేయించారనే తీవ్రమైన ఆరోపణలు ఇప్పుడు తెరపైకి వచ్చాయి. ఈ వ్యవహారంపై కల్వకుంట్ల కవితతో పాటు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కూడా నేరుగా ఇవే ఆరోపణలు గుప్పించడంతో ఈ అంశానికి రాజకీయంగా మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. హరీష్ రావు కుటుంబ ప్రయోజనాల కోసం అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ కాంగ్రెస్ శ్రేణులు సోషల్ మీడియా వేదికగా పెద్ద ఎత్తున ప్రచారాన్ని ముమ్మరం చేశాయి.

ఈ ఆరోపణలు ఇలా సాగుతుండగానే, ఊహించని విధంగా మిల్చీ మిల్క్ అధికారిక వెబ్‌సైట్ హఠాత్తుగా ఇంటర్నెట్ నుండి డౌన్ కావడం ఈ వివాదాన్ని మరింత పెంచింది.వెబ్‌సైట్ డౌన్ చేయడానికి అఫీషియల్ క్లైంట్స్ పేజీలో ఉన్న బడా విద్యాసంస్థల లోగోలు, పేర్లను కొందరు స్క్రీన్ షాట్లు తీసి సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ చేయడమేనని తెలుస్తోంది. ఈ స్క్రీన్ షాట్లు నెట్టింట వైరల్ కావడంతో, హరీష్ రావు క్యాంప్‌లో కొంత కంగారు మొదలైందనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతోంది. నిజంగానే అక్రమాలు జరగకపోతే వెబ్‌సైట్‌ను ఎందుకు బ్లాక్ చేయాల్సి వచ్చిందనే ప్రశ్నలను ప్రత్యర్థులు బలంగా సంధిస్తున్నారు. అయితే, తన రాజకీయ జీవితంలో ఎంతటి పెద్ద సంక్షోభాలనైనా సమర్థవంతంగా ఎదుర్కొన్న హరీష్ రావు.. ఇంతవరకు ఈ మిల్చీ మిల్క్ వివాదంపై నేరుగా ఎక్కడా స్పందించలేదు. సాధారణంగా తనపై చిన్న విమర్శ వచ్చినా గణాంకాలతో సహా తిప్పికొట్టే హరీష్, ఈ ఫ్యామిలీ బిజినెస్ వివాదంలో వ్యూహాత్మక మౌనం వహించడం వెనుక ఉన్న కారణాలపై రకరకాల ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. కానీ ప్రస్తుత తరుణంలో ఆయన ఈ అంశంపై గట్టిగా, పక్కా ఆధారాలతో స్పందించాల్సిన అవసరం కనిపిస్తోంది.రాబోయే రోజుల్లో హరీష్ రావు కనుక ఈ ఆరోపణలను బలంగా తిప్పికొట్టి తన వాదనను ప్రజల ముందు ఉంచగలిగితే ఈ వివాదానికి బ్రేక్ పడే అవకాశం ఉంటుంది. అలా కాకుండా ఈ మౌనాన్ని ఇలాగే కొనసాగిస్తే, అధికార కాంగ్రెస్ పార్టీ ఈ అంశాన్ని ఒక బలమైన పొలిటికల్ అస్త్రంగా మలచుకుని, ఎల్లప్పుడూ క్లీన్ ఇమేజ్‌తో ఉండే హరీష్ రావును రాజకీయంగా కార్నర్ చేస్తూనే ఉండే ప్రమాదం ఉంది. ఏదేమైనా, ఎప్పుడూ డిఫెన్స్‌లో పడనని చెప్పుకునే హరీష్ రావుకు ఈ డైరీ వివాదం ఒక పెద్ద పరీక్షగా మారిందనడంలో ఎలాంటి సందేహం లేదని భావిస్తున్నారు.

## హైడ్రా వేటలో రియల్ ఎస్టేట్ రాముడు టార్గెట్ తెలంగాణ రాజకీయాల్లో తెర వెనుక ఏం జరుగుతోంది?

హైదరాబాద్ : హైదరాబాద్ మహానగరంలో చెరువుల సంరక్షణ, అక్రమ కట్టడాల కూల్చివేతలే ధ్యేయంగా దూసుకుపోతున్న హైడ్రా చర్యలు రోజురోజుకూ సరికొత్త పొలిటికల్ టర్న్ తీసుకుంటున్నాయి. కేవలం సాధారణ నిబంధనల ఉల్లంఘనల ఆధారంగానే కాకుండా, ఒక పక్కా వ్యూహం ప్రకారం బడా ప్రాజెక్టులపై హైడ్రా విరుచుకుపడుతుండటం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ముఖ్యంగా ప్రదీప్ బిల్డర్స్, సంధ్యా కన్స్ట్రక్షన్స్ అధినేత శ్రీధర్ రావుకు సంబంధించిన ప్రాజెక్టులతో పాటు మరికొన్ని ప్రతిష్టాత్మక నిర్మాణాలను హైడ్రా టార్గెట్ చేయడం వెనుక బలమైన రాజకీయ, ఆర్థిక కారణాలు ఉన్నాయనే చర్చ రియల్ ఎస్టేట్ వర్గాల్లో జోరందుకుంది.ఈ మొత్తం వ్యవహారంలో తెరపైకి వస్తున్న అత్యంత ఆసక్తికరమైన అంశం ఏమిటంటే.. హైడ్రా విరుచుకుపడుతున్న ఈ బడా ప్రాజెక్టులన్నింటికీ ఒక అంతర్గత లింక్ ఉందనే ప్రచారం సాగడం. ఈ లింక్ నేరుగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ వైపు కనెక్ట్ అవుతోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఇటీవల సోషల్ మీడియా వేదికగా విసిరిన కొన్ని పరోక్ష విమర్శలు, రియల్ ఎస్టేట్ రాముడు అంటూ పెట్టిన నిక్ నేమ్ ఈ చర్చలకు మరింత ఆజ్యం పోశాయి. గత ప్రభుత్వ హయాంలో ఐటీ, మున్సిపల్ శాఖల నీడన సాగిన కొన్ని బడా రియల్ ఎస్టేట్ లావాదేవీల చిట్టా ఇప్పుడు బయటకు వస్తోందనే సంకేతాలు దీని ద్వారా వ్యక్తమవుతున్నాయి.నిజానికి బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం ఊహించని స్థాయికి దూసుకెళ్లింది. ఈ క్రమంలోనే తెరవెనుక అనేక భారీ ఆర్థిక లావాదేవీలు, చెరువుల ఎఫ్‌టీఎల్ పరిధుల మార్పులు జరిగాయనే ఆరోపణలు ఉన్నాయి. నగరంలోని బడా రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ఈ ఇన్ అండ్ అవుట్ లావాదేవీలపై, ఎవరెవరికి వాటాలు వెళ్లాయనే దానిపై పక్కా సమాచారం ఉంటుంది. అయితే, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పగ్గాలు చేపట్టిన తర్వాత, వ్యవస్థలో వచ్చిన మార్పుల వల్ల ఆయా సంస్థల అంతర్గత సమాచారం, పాత లీకులు కొత్త ప్రభుత్వ పెద్దల చేతికి చిక్కినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ లీకుల ఆధారంగానే, గత ప్రభుత్వానికి అత్యంత సన్నిహితంగా ఉంటూ నిబంధనలను బేఖాతరు చేసిన సదరు బడా బిల్డర్ల ప్రాజెక్టులనే హైడ్రా ఇప్పుడు ప్రత్యేకంగా టార్గెట్ చేస్తోందనే అభిప్రాయం రాజకీయ విశ్లేషకులలో బలంగా వినిపిస్తోంది. ఇది కేవలం పర్యావరణ పరిరక్షణ మాత్రమే కాదు.. గత పాలకుల ఆర్థిక మూలాలను దెబ్బతీసే ఒక వ్యూహాత్మక పొలిటికల్ అటాక్ అని భావిస్తున్నారు. ఎక్కడైతే గత ప్రభుత్వ పెద్దల ప్రయోజనాలు లేదా బినామీ హస్తాలు ఉన్నాయని అనుమానాలు ఉన్నాయో, సరిగ్గా ఆయా కట్టడాల వద్దకే హైడ్రా బుల్డోజర్లు వెళ్తుండటం ఈ వాదనకు బలాన్ని చేకూరుస్తోంది.ఇప్పుడు అందరినీ వేధిస్తున్న అతిపెద్ద ప్రశ్న.. ఈ హైడ్రా వేట ఇంతటితో ఆగిపోతుందా? లేక తెరవెనుక ఏవైనా బ్యాక్ గ్రౌండ్ సెటిల్మెంట్లు జరుగుతాయా? అనేది. సాధారణంగా రియల్ ఎస్టేట్ రంగంలో ఇలాంటి భారీ దాడులు జరిగినప్పుడు, సదరు వ్యాపారులు నష్ట నివారణ చర్యల్లో భాగంగా ప్రభుత్వ పెద్దలతో సయోధ్య కుదుర్చుకునే ప్రయత్నాలు చేస్తుంటారనేది ఓ బహిరంగ రహస్యం. కానీ, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషయంలో అత్యంత కఠినమైన వైఖరిని ప్రదర్శిస్తున్నారు. చట్టాన్ని ఉల్లంఘించిన వారు ఎంతటి వారైనా వదిలేది లేదని ఆయన పదే పదే స్పష్టం చేస్తున్నారు. రాబోయే రోజుల్లో హైడ్రా నిజంగానే చట్ట ప్రకారం కఠినమైన చర్యలు తీసుకుని, ఈ బడా ప్రాజెక్టుల వెనుక ఉన్న అసలైన సూత్రధారులను చట్టం ముందు నిలబెడుతుందా.. లేదా కేవలం రాజకీయ మైలేజ్ కోసమే ఈ రచ్చ సాగుతుందా అన్నది కాలమే నిర్ణయించాలి. హైడ్రా తీసుకుంటున్న ఈ దూకుడు నిర్ణయాలు అటు బీఆర్ఎస్ అగ్ర నాయకత్వానికి, ఇటు భాగ్యనగర రియల్ ఎస్టేట్ మాఫియాకు ఒక బలమైన హెచ్చరిక లాంటివని రాజకీయవర్గాలు గట్టిగా నమ్ముతున్నాయి.

# ప్రభుత్వ పాఠశాలల బలోపేతం తాగునీటి సమస్యల నివారణ




**ప్రజాపాలన అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలి**
**జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వీడియో కాన్ఫరెన్స్**
**జిల్లాలో విద్య, వ్యవసాయం, ఆరోగ్య రంగాలకు ప్రాధాన్యం,**
**నాగర్‌కర్నూల్ జిల్లా పురోగతిని వివరించిన కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**


నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి జూలై 16: రాష్ట్రంలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలును మరింత వేగవంతం చేయడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. తాగునీటి సరఫరా, ప్రజారోగ్యం, సీజనల్ వ్యాధుల నివారణ, ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, విద్యార్థుల నమోదు, ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణాలు, రైతులకు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలపై అవగాహన, ప్రజాపాలన కార్యక్రమాల అమలు తదితర అంశాలపై హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమగ్రంగా సమీక్షించారు.
ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ....., రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయం, తాగునీరు, ప్రజా సేవల రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లాల యంత్రాంగం ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ పాల్గొని జిల్లాలో వివిధ శాఖల్లో చేపడుతున్న కార్యక్రమాల పురోగతిని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచేందుకు ఇప్పటికే మండల విద్యాధికారులు (ఎంఈఓలు), ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థుల నమోదు కోసం గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టడంతో జిల్లాలో నమోదు శాతం గణనీయంగా పెరుగుతోందని చెప్పారు. నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్ నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, వాటిని నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. తెలంగాణ మోడల్ స్కూల్‌ల ఎంపిక, అభివృద్ధికి సంబంధించిన కార్యాచరణ ప్రణాళికలను కూడా సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. భారత వాతావరణ శాఖ హెచ్చరికలు, సూచనలను ఎప్పటికప్పుడు రైతులకు చేరవేస్తున్నామని, రైతు వేదికల ద్వారా సేంద్రియ వ్యవసాయం, ఉద్యాన పంటలు, ఆయిల్ ఫామ్ సాగుపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. మార్కెట్ అవకాశాలు ఉన్న పంటల సాగు వైపు రైతులను ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు. సీజనల్ వ్యాధుల నివారణకు వైద్యారోగ్య శాఖ అధికారులను పూర్తిస్థాయిలో అప్రమత్తం చేసినట్లు తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లో వైద్య శిబిరాలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు, పారిశుధ్య చర్యలు చేపడుతూ ప్రజారోగ్య పరిరక్షణకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని వివరించారు.
ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అమలు చేస్తున్న 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించిందని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన జిల్లా ప్రత్యేక అధికారి ప్రతి నెల జిల్లాను సందర్శించి వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తూ అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలిస్తున్నారని, అందుకు అనుగుణంగా జిల్లాలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరించారు. జిల్లాలో ప్రజాపాలన కార్యక్రమం కింద వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించేందుకు అధికారులు నిరంతరం కృషి చేస్తున్నారని కలెక్టర్ తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ అరుణ రెడ్డి, జిల్లా విద్యాశాఖ, వైద్యారోగ్య శాఖ, వ్యవసాయ శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, పంచాయతీరాజ్ శాఖతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# పెబ్బేరు మండల తాసిల్దార్ కార్యాలయం లో దారుణం



**భవనం లోపల పూర్తిగా నేలలోకి కుంగిపోయిన అడుగు భాగం**
**ఇలాగే కార్యాలయంలో తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్న సిబ్బంది**
**ఈ విషయంపై ఎవరు పట్టించుకోవడంలేదని అధికారులు వాపోతున్నారు**
**ఎప్పుడు మరింత లోతుకు కృంగిపోతుందో తెలియని ఆందోళనలో సిబ్బంది**
**వనపర్తి ఎమ్మెల్యే తుడిమేగా రెడ్డి దీనిపై స్పందించాలని అభ్యర్ధన**





వనపర్తి. సమయం ప్రతినిధి. జులై 16: ఈ అంశంపై అధికార యంత్రాంగం స్పందించి ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండే తాసిల్దార్ కార్యాలయాన్ని బాగు చేయాలని భూముల రిజిస్ట్రేషన్ కొరకు మరియు తమ అవసరాల నిమిత్తం ధ్రువపత్రాల కోసం వచ్చిన ప్రజలు స్పందిస్తూ ప్రజా నాయకుడు ఎమ్మెల్యే తుడిమేగా రెడ్డి ని ఉన్నతఅధికారులను వేడుకుంటున్నారు భూముల రిజిస్ట్రేషన్ ల పేరుతో అధిక మొత్తంలో మార్కెట్ విలువలను పెంచి సాధారణ జీవనం గడుపుతున్న ప్రజలపై భారాన్ని పెంచడమే కాక ప్రభుత్వానికి ఆదాయాన్ని తెచ్చి పెడుతూ ప్రజల అవసరాలను తీరుస్తున్న కార్యాలయాలను పట్టించుకోవడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని మేధావులు తదితర సంఘసంస్కర్తలు ఆరోపిస్తున్నారు ఇప్పటికైనా అధికారం యంత్రాంగం కళ్ళు తెరిచి ఈ సమస్యకు పరిష్కారం చూపాలని కార్యాలయ సిబ్బంది ప్రజలు కోరుతున్నారు.

# ఎమ్మెల్యేల్లో అంతర్గత అసహనం


విజయవాడ : ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చిన తర్వాత తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వం పటిష్టమైన పాలనపై దృష్టి పెట్టినప్పటికీ, తెరవెనుక పార్టీ ఎమ్మెల్యేలలో పెరుగుతున్న అసంతృప్తి ఇప్పుడు అధిష్ఠానానికి సరికొత్త సవాల్‌గా మారుతోంది. అయితే, ఈ అసంతృప్తికి ప్రభుత్వంపై వ్యతిరేకత కానీ, నిధుల కొరత కానీ కారణం కాకపోవడం ఇక్కడ అసలు ట్విస్ట్. క్షేత్రస్థాయిలో తమకు దశాబ్దాలుగా శత్రువులుగా ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులను, ప్రత్యర్థులను ప్రభుత్వం ఆర్థికంగా దెబ్బతీయకపోగా, అయాచితంగా కొన్ని నిర్ణయాల వల్ల వారు మరింత బలోపేతం అవుతుండటమే ఈ అసంతృప్తికి ప్రధాన కారణం.ఈ అంతర్గత అసహనానికి తాజా ఉదాహరణగా గన్నవరం శాసనసభ్యుడు యార్లగడ్డ వెంకట్రావు నిలిచారు. గన్నవరం నియోజకవర్గంలో గత ప్రభుత్వ హయాంలో టీడీపీ కేడర్‌ను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరులకు, ఆయనకు ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలిచే ఒక ప్రముఖ కన్స్ట్రక్షన్ సంస్థకు గన్నవరం ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ పెండింగ్ పనుల కాంట్రాక్ట్ దక్కడంపై వెంకట్రావు తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. తమ కళ్ల ముందే ప్రత్యర్థులు ప్రభుత్వ కాంట్రాక్టుల ద్వారా మళ్లీ ఆర్థికంగా పుంజుకుంటుంటే, నియోజకవర్గంలో తమ రాజకీయ ఉనికి ఏమవాలనే ఆందోళన ఆయనను బహిరంగంగానే మాట్లాడేలా చేసింది.వెంకట్రావు లేవనెత్తిన ఈ అంశం కేవలం గన్నవరానికి మాత్రమే పరిమితం కాలేదు, రాష్ట్రవ్యాప్తంగా మెజార్టీ టీడీపీ ఎమ్మెల్యేల అంతర్గత సమస్య ఇదేనని పొలిటికల్ సర్కిల్స్ లో విశ్లేషణలు సాగుతున్నాయి. గత ఐదేళ్లపాటు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తీవ్ర అణచివేతకు గురై, ఆస్తులు నష్టపోయి, పార్టీ కోసం నిలబడిన కార్యకర్తలపై నమోదైన పాత కేసులు ఇప్పటికీ పూర్తిగా పరిష్కారం కాలేదు. ఒకవైపు సొంత కేడర్ పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరుగుతుంటే, మరోవైపు ప్రత్యర్థి పార్టీ నేతలు అధికార యంత్రాంగంలోని కొందరు అధికారుల అండతో యథేచ్ఛగా తమ వ్యాపారాలను, ఆర్థిక సామ్రాజ్యాలను కాపాడుకోవడం ఎమ్మెల్యేలకు మింగుడుపడటం లేదు.అధికారంలోకి వచ్చిన కొత్తలో సహజంగానే అధికారులు పాత కాంట్రాక్టర్ల పెండింగ్ పనులను క్లియర్ చేయడం, సాంకేతిక కారణాల వల్ల పాత సంస్థలకే ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంటుంది. కానీ, రాజకీయ క్షేత్రంలో ఇది తప్పుడు సంకేతాలు పంపుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రత్యర్థులను ఆర్థికంగా దెబ్బతీయకపోతే, వారు రాబోయే రోజుల్లో మళ్లీ పుంజుకుని తమపైకే రాజకీయంగా దాడికి వస్తారనే భయం టీడీపీ ఎమ్మెల్యేలలో స్పష్టంగా కనిపిస్తోంది. అధికారుల నిర్ణయాలు తమ రాజకీయ భవిష్యత్తును దెబ్బతీస్తున్నాయని వారు అంతర్గత సమావేశాల్లో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుతం ప్రభుత్వ నిర్వహణ, పాలనాపరమైన సంస్కరణలపైనే పూర్తి దృష్టి పెట్టిన టీడీపీ హైకమాండ్‌కు, సొంత పార్టీ శాసనసభ్యుల మనోభావాలను , క్షేత్రస్థాయిలో జరుగుతున్న లోపాలను గమనించడానికి తగినంత తీరిక లేనట్లు కనిపిస్తోంది. పార్టీ కోసం కష్టపడిన వారికి తగిన ప్రాధాన్యత దక్కడం లేదనే భావన కేడర్‌లో బలపడితే, అది రాబోయే రోజుల్లో ప్రభుత్వ ఇమేజ్‌పై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఎమ్మెల్యేలు నేరుగా అసెంబ్లీ లోపల లేదా బహిరంగ వేదికలపై అసంతృప్తిని వెళ్లగక్కకముందే అధిష్ఠానం జోక్యం చేసుకోవాల్సి ఉంటుంది. టీడీపీ అగ్రనాయకత్వం ఈ తీవ్రతను గుర్తించి, నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేల సమస్యలను ఆలకించకపోతే పరిస్థితి చేయిదాటిపోయే ప్రమాదం ఉంది. బ్యూరోక్రసీ తీసుకునే నిర్ణయాలు పార్టీ రాజకీయ ప్రయోజనాలకు గొడ్డలిపెట్టుగా మారకుండా ఒక స్పష్టమైన కోఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని టీడీపీ సీనియర్ నేతలు అనుకుంటున్నారు.

చంద్రబాబుకు తీరక లేదు... లోకేష్ బిజీ బిజీ

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇది మంచి ప్రభుత్వం అనే నినాదంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలనను ముందుకు తీసుకెళు_న్నారు. అయితే, ఈ మంచితనం ఇప్పుడు సొంత పార్టీ ఎమ్మెల్యేలకు, ముఖ్యంగా క్షేత్రస్థాయిలో కష్టపడిన కీలక నేతలకు ఒక కొత్త తలనొప్పిగా మారింది. తెలుగుదేశం పార్టీ లోని కొందరు సిట్టింగ్ ఎమ్మెల్యేలలో అంతర్గత అసంతృప్తి రోజురోజుకూ పెరిగిపోతోంది. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు వంటి నేతలు ఇటీవల బహిరంగంగానే తమ ఆవేదనను వెళ్లగక్కడం దీనికి నిదర్శనం. అయితే, ఈ అసంతృప్తి చంద్రబాబు నాయకత్వంపై కానీ, పార్టీ సిద్ధాంతాలపై కానీ కాదు. నియోజకవర్గాల స్థాయిలో తమ రాజకీయ, ఆర్థిక మనుగడకు పొంచి ఉన్న ప్రమాదంపైనే ఈ ఆందోళన అంతా.గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో తీవ్రమైన అణచివేతను, ఆర్థిక నష్టాలను భరించి, నియోజకవర్గాల్లో పార్టీ జెండాను మోసి గెలిచిన టీడీపీ ఎమ్మెల్యేలకు ఇప్పుడు ఒక విచిత్రమైన పరిస్థితి ఎదురవుతోంది. ప్రభుత్వం అనుసరిస్తున్న ఉదార విధానాల వల్ల, నియోజకవర్గాల్లో పాత అధికార పార్టీకి చెందిన కాంట్రాక్టర్లు, మైనింగ్ మాఫియా, ఆర్థిక శక్తులు ఇప్పటికీ యథేచ్ఛగా తమ వ్యాపారాలను సాగిస్తూ ఆర్థికంగా మరింత బలం పుంజుకుంటున్నారు. రాజకీయం ముగిసింది.. ఇక అందరూ సమానమే అనే ప్రభుత్వ ధోరణి వీరికి వరంగా మారింది. ప్రత్యర్థులు ఇలాగే ఆర్థికంగా బలపడితే, రాబోయే రోజుల్లో వారు తమకే ఏకు మేకవుతారనే సహజమైన భయం టీడీపీ ఎమ్మెల్యేలను వెంటాడుతోంది. చెడ్డవాళ్లకు చూపించే అతి మంచితనం.. చివరికి తమ రాజకీయ జీవితాలకే చేటు చేస్తుందని వారు ఆందోళన చెందుతున్నారు.ప్రస్తుత పరిస్థితుల్లో ఎమ్మెల్యేలకు ఉన్న ఈ అంతర్గత, వ్యూహాత్మక సమస్యలను అధిష్ఠానానికి వివరించడం ఒక పెద్ద సవాలుగా మారింది. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు అమరావతి నిర్మాణం, సంక్షేమ పథకాల అమలు, రాష్ట్ర బడ్జెట్ నిర్వహణ వంటి భారీ బాధ్యతలతో క్షణం తీరిక లేకుండా గడుపుతున్నారు. మరోవైపు ఐటీ, నైపుణ్యాభివృద్ధి శాఖల మంత్రిగా నారా లోకేష్ కూడా నిరంతరం సమీక్షలు, పర్యటనలతో బిజీగా ఉన్నారు. కిందిస్థాయి ఎమ్మెల్యేల వ్యక్తిగత బాధలను, నియోజకవర్గాల గ్రౌండ్ రియాలిటీలను లోకేష్ ఒక్కరే పూర్తిగా వినడం లేదా పరిష్కరించడం ఆచరణాత్మకంగా సాధ్యం కావడం లేదు.

## పరిశుభ్రత ప్రమాణాలు పాటించాలి

**– మున్సిపల్ కమిషనర్ వినోద్ కుమార్**



మహబూబాబాద్, జూలై 16, సమయం ప్రతినిధి : మహబూబాబాద్ పట్టణంలోని హోటళ్లు, రెస్టారెంట్లు, బిర్యానీ సెంటర్లు తదితర ఆహార విక్రయ కేంద్రాలు పరిశుభ్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని మున్సిపల్ కమిషనర్ వినోద్ కుమార్ అన్నారు. గురువారం మున్సిపాలిటీ, ఫుడ్ సేఫ్టీ అధికారులు సంయుక్తంగా పాతబజార్, ఆర్టీసీ బస్టాండ్, నర్సంపేట రోడ్డులోని పలు బిర్యానీ సెంటర్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా ఆహార పదార్థాల నాణ్యత, వంటశాలల పరిశుభ్రత, ఆహార నిల్వ విధానాలు, గడువు ముగిసిన ఆహార పదార్థాల వినియోగం, వంటగది సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత, తాగునీటి నాణ్యతతో పాటు ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నిబంధనల అమలును అధికారులు పరిశీలించారు. తనిఖీలలో పలు లోపాలు గుర్తించిన అధికారులు సంబంధిత నిర్వాహకులకు 22,000 జరిమానా విధించారు. గుర్తించిన లోపాలను వెంటనే సరిదిద్దాలని ఆదేశించడంతో పాటు, పరిశుభ్రత ప్రమాణాలు పాటించని, ఆహార భద్రతా నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారం అందించడం ప్రతి ఆహార వ్యాపారి బాధ్యత అని అధికారులు పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, ఫుడ్ సేఫ్టీ అధికారి ధర్మేందర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## సర్‌లో పాల్గొన్న ప్రభుత్వ సలహాదారు కుటుంబం



మహబూబ్‌నగర్: ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా మాజీ ఎంపీ, తెలంగాణ ప్రభుత్వ క్రీడా వ్యవహారాల సలహాదారు ఏ.పి. జితేందర్ రెడ్డి కుటుంబ సభ్యులు సంబంధిత BLO శ్రీమతి లక్ష్మి కి SIR (Special Intensive Revision) ఫారాలు సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీ ఏ.పి. నరేందర్ రెడ్డి, శ్రీ ఏ.పి. మిథున్ రెడ్డి తదితర కుటుంబ సభ్యులు పాల్గొని, ఓటరు జాబితాలో వివరాల నమోదు, సవరణ మరియు ధృవీకరణ ప్రక్రియను పూర్తి చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హత కలిగిన పౌరుడు తన పేరు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదు చేసుకోవాలని వారు సూచించారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని, తమ వివరాలను పరిశీలించి అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకోవాలని పిలుపునిచ్చారు.

## నల్లమల్లో వజ్రాల వేట

కర్నూలు : నంద్యాల – ఒంగోలు జాతీయ రహదారి పరిధిలోని నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న ఎర్రవాగులో వజ్రాల వేట మొదలైంది. పెద్దగా వర్షాలు కురవకపోయినా.. గతంలో కురిసిన వర్షాలకు అటవీ ప్రాంతం నుంచి నీరు వచ్చింది. దాంతో అడవిలోని వజ్రాలు వాగుతో సహా కొట్టుకొచ్చి ఉంటాయనే కారణంతో స్థానికులు వజ్రాల అన్వేషణ మొదలుపెట్టారు. నీటి అడుగు భాగంలో వజ్రాల కోసం అన్వేషణ చేస్తున్నారు. కడప, కర్నూలు, మార్కాపురం జిల్లా ప్రజలు ఎక్కువగా అన్వేషిస్తున్నారు.నల్లమల అటవీ ప్రాంతం మరోసారి ఆశావాహులతో కిటికిటలాడుతోంది. వర్షాకాలం మొదలైందంటే నల్లమల ప్రాంతమంతా వజ్రాల వేటే. ప్రతి ఒక్కరూ తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి సిద్ధమవుతుంటారు. కొంతమంది అయితే నెలల తరబడి ఇదే ప్రాంతంలో ఉంటూ వజ్రాల వేట కొనసాగిస్తారు. ముఖ్యంగా నంద్యాల ఒంగోలు ప్రధాన మార్గంలోని నల్లమల అడవీలో ఉన్న ఎర్రవాగు వైపే అందరూ ప్రయాణిస్తారు.నల్లమల అడవీలో ఉన్న ఎర్రవాగులో జోరుగా వజ్రాల వేట కొనసాగుతోంది. నంద్యాల, కర్నూలు, మార్కాపురం, కడప, ప్రకాశం, గుంటూరు జిల్లాల పరిధిలోని గ్రామాలకు చెందిన మహిళలు, పురుషులు ఎర్రవాగుకు చేరుకుని వజ్రాల వేట కొనసాగిస్తున్నారు. వాగు వెంట నీటిలో జల్లెడ పడుతున్నారు. ప్రతి ఏటా వాగులో నీరు ప్రవహించే సమయాల్లో వజ్రాల కోసం ఈ అన్వేషణ కొనసాగుతుంది.నెల రోజుల వ్యవధిలో ఇటీవల కురిసిన సాధారణ వర్షాలకు నల్లమలలో నీటి ప్రవాహం జరిగింది. దాంతో ప్రజలు వజ్రాల వేట కొనసాగిస్తున్నారు. గత నెలలో కర్నూలు జిల్లా తుగ్గిలి మండలం జొన్నగిరిలో కూడా వజ్రాల వేట మొదలుపెట్టారు. జొన్నగిరి ప్రాంతంలో పొలాలకు వెళ్లి మరీ అన్వేషణ కొనసాగిస్తున్నారు.

# ఆయిల్ ఫామ్ సాగుతో లక్షల ఆదాయం సాధించొచ్చు

**తక్కువ నీటితో అధిక లాభం**
**రైతులు ముందుకు రావాలి**
**జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్**



నాగర్కర్నూల్ సమయం ప్రతినిధి జూలై 16: వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగు ద్వారా రైతులు అధిక ఆదాయం పొందే అవకాశాలు ఉన్నాయని, ముఖ్యంగా ఆయిల్ ఫామ్ సాగు లాభదాయకమైన పంటగా నిలుస్తోందని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అన్నారు. అచ్చంపేట మండలంలోని లింగోటం గ్రామానికి చెందిన ప్రగతిశీల రైతు రాజశేఖర్ గౌడ్ తన 4 ఎకరాల్లో సాగు చేసిన ఆయిల్ ఫామ్ తోటను జిల్లా ఉద్యాన శాఖ, ఇతర రైతులు , ఆయిల్ ఫామ్ కంపెనీ అధికారులతో కలిసి గురువారం కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ పరిశీలించారు. ఈ సందర్భంగా తోటలో మొక్కల పెరుగుదల, దిగుబడి, నీటి వినియోగం, నిర్వహణ పద్ధతులు, కోత విధానాలను క్షుణ్ణంగా పరిశీలించిన కలెక్టర్ రైతుతో మాట్లాడి పంట సాగుకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ....., లింగోటం గ్రామ రైతు రాజశేఖర్ గౌడ్ సాధించిన విజయం ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. సంప్రదాయ పంటలతో పాటు మార్కెట్ డిమాండ్ ఉన్న ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని, ముఖ్యంగా వరికి బదులుగా తక్కువ నీటితో అధిక ఆదాయం ఇచ్చే ఆయిల్ ఫామ్ వంటి పంటలను సాగు చేయడం ద్వారా రైతుల ఆదాయం గణనీయంగా పెరుగుతుందని కలెక్టర్ తెలిపారు.
రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని, వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులకు ఆయిల్ ఫామ్ సాగు, నిర్వహణ, ప్రభుత్వ ప్రోత్సాహకాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. విజయవంతమైన రైతుల అనుభవాలను ఇతర రైతులతో పంచుకోవడం ద్వారా ఆయిల్ ఫామ్ సాగు విస్తీర్ణం పెరిగే అవకాశాలు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ప్రగతిశీల రైతు రాజశేఖర్ గౌడ్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు. రైతు సాధించిన విజయాన్ని కొనియాడుతూ, ఇదే స్ఫూర్తితో మరింత మంది రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు అడుగులు వేయాలని కలెక్టర్ కోరారు. భారత వాతావరణ శాఖ అధికారం వెల్లడించిన వివరాల ప్రకారం నాగర్ కర్నూల్ జిల్లాలో ఈ సంవత్సరం వర్షాలు ఆశించిన స్థాయిలో లేకపోవడం వంటి పరిస్థితులు ఉన్నాయని, ప్రాజెక్టుల్లో కూడా నీటి నిలువలు కేవలం త్రాగునీటి అవసరాల కోసమే ఉన్నాయని, రైతులు ఈ విషయాలను అర్థం చేసుకోని, వరికి ఇతర ప్రత్యామ్నాయ పంటలను పండించేలా ముందుకు రావాలని కలెక్టర్ రైతులకు విజ్ఞప్తి చేశారు. అక్కడ వచ్చిన కొంతమంది రైతులు 30 ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగుకు ముందుకు రాగా, కలెక్టర్ వారి అందరిని అభినందించి, అందుకు అవసరమైన చర్యలను వెంటనే తీసుకోవాలని ఉద్యాన శాఖ అధికారులను ఆదేశించారు. అంతకు ముందు........... రైతు రాజశేఖర్ గౌడ్ మాట్లాడుతూ..., నాలుగేళ్ల క్రితం నాలుగు ఎకరాల్లో ఆయిల్ ఫామ్ మొక్కలను నాటినట్లు తెలిపారు. ఈ ఏడాది మొదటిసారిగా వాణిజ్య స్థాయిలో దిగుబడి రావడం ప్రారంభమైందని చెప్పారు. ఎకరానికి సుమారు నాలుగు టన్నుల చొప్పున మొత్తం 16 టన్నుల ఆయిల్ ఫామ్ గింజలు ఉత్పత్తి అయ్యాయని వివరించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం ప్రతి టన్నుకు రూ. 23,783 చొప్పున మొత్తం రూ. 3,65,000కు పైగా ఆదాయం వచ్చినట్లు కలెక్టర్‌కు రైతు వివరించారు. పంటకు మంచి మార్కెట్ ఉండటంతో పాటు ప్రభుత్వ మద్దతు కూడా లభిస్తుండటం రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రైతు ఈ సందర్భంగా తెలిపారు. ఆయిల్ ఫామ్ సాగులో డ్రిప్ ఇరిగేషన్‌ను వినియోగిస్తున్నట్లు రాజశేఖర్ గౌడ్ చెప్పారు. ఈ పంటకు నీటి అవసరం తక్కువగా ఉండటంతో పాటు, నీటి వినియోగం కూడా సమర్థవంతంగా ఉంటుందని వివరించారు. సరైన నిర్వహణ, ఎరువుల వినియోగం, సమయానుకూల సంరక్షణతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశం మాట్లాడుతూ...., ఆయిల్ ఫామ్ తోటల్లో పండిన గెలలను ఎలా గుర్తించాలి, కోతకు సరైన సమయం ఏది, ఏ విధానంలో గెలలను కోయాలి, కోత అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి వంటి అంశాలను కలెక్టర్‌తో పాటు అక్కడికి వచ్చిన రైతులకు వివరించారు. శాస్త్రీయ పద్ధతులను అనుసరిస్తే దిగుబడి మరింత పెరుగుతుందని సూచించారు. ఆయిల్ ఫామ్ సాగును ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాన్ని అందజేస్తోందని తెలిపారు. రైతు మొక్కలు నాటిన సంవత్సరం నుంచి వరుసగా నాలుగు సంవత్సరాల పాటు ప్రతి ఎకరానికి రూ. 4,200 చొప్పున ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు వెల్లడించారు. ఈ పథకం ద్వారా రైతులకు ప్రారంభ దశలో ఆర్థిక భారం తగ్గుతుందని అయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి వెంకటేశం, అచ్చంపేట డివిజన్ ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్, నాగర్ కర్నూల్ డివిజన్ ఉద్యాన శాఖ అధికారి జగన్, వ్యవసాయ అధికారులు, గ్రామ సర్పంచ్ వివిధ గ్రామాలకు చెందిన రైతులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల్లో చేతి నరాల గాయాలపై అవగాహన పెంచుకోవాలి




హైదరాబాద్, (సమయం ప్రతినిధి): యశోద హాస్పిటల్ హైటెక్ సిటీ యూనిట్‌లో ప్లాస్టిక్, రీకన్‌స్ట్రక్టివ్ మరియు బ్రేకియల్ ప్లెక్సస్ సర్జన్ డా. పి. ప్రకాష్ ఆధ్వర్యంలో బ్రేకియల్ ప్లెక్సస్ (చేతికి సరఫరా చేసే నరాల) గాయాలపై అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా డా. పి. ప్రకాష్ మాట్లాడుతూ, బ్రేకియల్ ప్లెక్సస్ ఇంజరీ అంటే చేతికి సంబంధించిన నరాలు దెబ్బతినడం అని తెలిపారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు, ద్విచక్ర వాహన ప్రమాదాల్లో యువత ఈ సమస్యకు ఎక్కువగా గురవుతున్నారని చెప్పారు. చేతి కదలికలు లేకపోవడం, స్పర్శ కోల్పోవడం, భుజం లేదా మోచేయి పనిచేయకపోవడం, చేయి పూర్తిగా చచ్చుబడినట్లు అనిపించడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే బ్రేకియల్ ప్లెక్సస్ నిపుణుడిని సంప్రదించాలని సూచించారు. చాలామంది అవగాహన లేక ఫిజియోథెరపీతోనే కాలయాపన చేయడం వల్ల చికిత్స ఆలస్యమై ఆశించిన ఫలితాలు తగ్గే అవకాశం ఉంటుందని తెలిపారు. గాయం జరిగిన తొలి నెలల్లోనే సరైన చికిత్స తీసుకుంటే నర్వ్ రిపేర్, నర్వ్ గ్రాఫ్టింగ్, నర్వ్ ట్రాన్స్‌ఫర్, టెండన్ ట్రాన్స్‌ఫర్, కండరాల మార్పిడి వంటి శస్త్రచికిత్సల ద్వారా చేతి పనితీరును గణనీయంగా పునరుద్ధరించే అవకాశం ఉందని వివరించారు. బ్రేకియల్ ప్లెక్సస్ గాయాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడమే ఈ సదస్సు ప్రధాన ఉద్దేశమని, ఇలాంటి లక్షణాలు ఉన్నవారు ఆలస్యం చేయకుండా నిపుణులైన వైద్యులను సంప్రదించి సకాలంలో చికిత్స పొందాలని డా. పి. ప్రకాష్ సూచించారు.

## జర్నలిస్టులందరికీ అక్రిడేటేషన్ కార్డులు ఇవ్వాలి
### రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీఆర్ లెనిన్




మహబూబాబాద్, జూలై 16, సమయం ప్రతినిధి : జిల్లాలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేటేషన్ కార్డులు, ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీడబ్ల్యూజేఎఫ్) హెచ్-143 రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీఆర్ లెనిన్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఐఎంఏ హాల్‌లో నిర్వహించిన జర్నలిస్టుల సమన్వయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహబూబాబాద్ జిల్లాలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న కొందరు అర్హులైన జర్నలిస్టులకు ఇప్పటికీ అక్రిడేటేషన్ కార్డులు అందకపోవడం బాధాకరమని అన్నారు. అర్హతలు కలిగిన ప్రతి జర్నలిస్టుకు ఎలాంటి వివక్ష లేకుండా అక్రిడేటేషన్ కార్డులు మంజూరు చేసి, వారి సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, జర్నలిస్టుల సభ్యత్వ నమోదు పెంచాలని, జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ప్రతి జర్నలిస్టు వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి రోడ్డు భద్రతా నిబంధనలను పాటించాలన్నారు. ఈ సమావేశంలో జాతీయ కౌన్సిలర్ సభ్యులు తీగల కృష్ణారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు వీరగాని బిక్షం, వెంకటేశ్వర్లు, జిల్లా కన్వీనర్ మద్దినేని గుట్టయ్య, కోకన్వీనర్ గాడిపెల్లి శేఖర్, కరుణాకర్, ప్రసాద్, శ్రీధర్, కిరణ్ కుమార్, లక్ష్మణ్, మాదాసు మహేష్, ఇండ్ల మహేష్, సంతోష్, సుబ్రహ్మణ్యం, మాలోత్ సురేష్, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు

## సోనం వాంగ్చుక్ ప్రాణాలు కాపాడాలి!


**నీట్ వైఫల్యంపై కేంద్ర విద్యా మంత్రి రాజీనామా చేయాలి!!**
**మంచిర్యాలలో బీసీ, బహుజన, ప్రజా సంఘాల నిరసన ప్రదర్శన**



హైదరాబాద్ : దేశ రాజధాని లో 19 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న సోనం వాంగ్చుకుతో చర్చలు జరిపి కేంద్ర ప్రభుత్వం దీక్షను విరమింప జేయాలని వివిధ ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో గురువారం రోజున అంబేద్కర్ విగ్రహం దగ్గర జరిగిన నిరసన ప్రదర్శనలో వివిధ ప్రజా సంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వైఫల్యం కారణంగానే నీట్ పేపరు లీకయి 21 మంది అమాయక విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని వారు ఆరోపించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పాలకులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలి కాబట్టి, బాధ్యతలను సక్రమంగా నిర్వహించని కేంద్ర మంత్రిని పదవి నుండి బర్తరఫ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. 19 రోజులుగా సోనం వాంగ్చుక్ నిరాహారదీక్ష చేస్తున్నా.. కేంద్ర ప్రభుత్వ పెద్దలు నిర్లక్ష్య ధోరణి వహించడం సరైనది కాదని వారు తెలిపారు. ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీగా ఉండాలని, ఉద్యమకారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి ముందుకు రావాలని వారు కోరారు. గతంలో లోక్ పాల్ బిల్లు కోసం అన్నా హజారే నిరసన దీక్ష చేపట్టినప్పుడు.. మన్మోహన్ సింగ్ ప్రభుత్వం దిగివచ్చి ఉద్యమకారుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చిందని వారు గుర్తు చేశారు. నేటి కేంద్ర ప్రభుత్వ పెద్దలు మొండి వైఖరిని అవలంబించడాన్ని దేశ ప్రజలు నిరసిస్తున్నారని వారు తెలిపారు. దేశానికి విలువైన సేవలు అందించిన శాస్త్రవేత్తగా పర్యావరణవేత్తగా సోనం వాంగ్చుకు దేశ ప్రజలందరికీ ఆప్త బంధువుగా నిలిచాడని వారు పేర్కొన్నారు. సోనం వాంగ్చుకు ప్రాణాలు వెలకట్టలేనివని, తక్షణం ప్రభుత్వ పెద్దలు చర్చలకు సిద్ధం కావాలని వారు కోరారు. ప్రభుత్వ విధానాలపై నిరసన తెలుపుతున్న వారిని దేశద్రోహులని, విదేశీ ఏజెంట్లని నిందించడం మానుకోవాలని హితవు పలికారు. విద్యారంగంలో సమూల మార్పులు తీసుకురావడంతో పాటు.. యువతకు ఉపాధి కల్పించే దిశలో పాలకులు శ్రద్ధ తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు కనుకుంట్ల మల్లయ్య, సామాజిక న్యాయ వేదిక కన్వీనర్ రంగు రాజేశం, బీసీ మేధావుల ఫోరం జిల్లా చీఫ్ కోఆర్డినేటర్ శ్రీరామోజు కొండయ్య, పౌర స్పందన వేదిక కన్వీనర్ క్యాతం రవికుమార్, తెలంగాణ జన సమితి నాయకులు ప్రదీప్, తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర నాయకులు జైపాల్ సింగ్, సామాజిక ఉద్యమకారులు డాక్టర్ చుంచు రాజ్ కిరణ్, మోతె రామదాసు, దేవి సత్యం, శ్రీమన్నారాయణ, బొజ్జ శరత్, సంకె రవి, గోగుల రవీందర్ రెడ్డి, రాధేశ్యాం, వేముల కిరణ్, షబ్బీర్ పాషా, కైలాసం, పడాల శ్రీనివాస్, మధు, జాగిరి రాజేష్, పూరెల్ల నితీష్, అంకం సాగర్, మెరుగు సతీష్, సమ్మయ్య, మహ్మద్ ఇబ్రహీం, కట్ట ప్రకాష్, మిడివెల్లి రాజ్ కుమార్, అడ్వాల లింగమూర్తి, రాజగోపాలాచారి తదితరులు పాల్గొన్నారు.

## నంద కిషోర్ గోయెంకా జ్ఞాపకార్థం రూ.100 కోట్లతో యూనివర్సిటీ

**డాక్టర్ సుభాష్ చంద్ర కీలక ప్రకటన**



సమయం ప్రతినిధి, నల్లగొండ : ఎస్సెల్ గ్రూప్ ఛైర్మన్ అధినేత డాక్టర్ సుభాష్ చంద్ర తన తండ్రి, ప్రముఖ సామాజిక కార్యకర్త స్వర్గీయ నంద కిషోర్ గోయెంకా జ్ఞాపకార్థం ఒక ప్రతిష్టాత్మక విద్యా సంస్థను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. 'శ్రీ నంద్ కిషోర్ గోయెంకా విశ్వవిద్యాలయం' పేరుతో మొత్తం 32 ఎకరాల విస్తీర్ణంలో రూ. 100 కోట్ల భారీ వ్యయంతో ఈ యూనివర్సిటీని నిర్మించనున్నారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం కన్నుమూసిన నంద్ కిషోర్ గోయెంకా అంత్యక్రియలు హిస్సార్‌లోని అగ్రోహా ధామ్‌లో ముగిసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత తన తండ్రి పేరు, ఆయన ఆశయాలు చిరస్థాయిగా నిలిచిపోయేలా డాక్టర్ సుభాష్ చంద్ర ఈ కీలక నిర్ణయాన్ని వెల్లడించారు.

**వర్సిటీలో సామాజిక సేవపై ప్రత్యేక కోర్సు..**

నంద కిషోర్ గోయెంకా వారసత్వాన్ని, మానవీయ విలువలను రాబోయే తరాలకు అందించేలా ఈ విశ్వవిద్యాలయంలో "సామాజిక సేవ, దాతృత్వం"పై ఒక ప్రత్యేక కోర్సును ప్రారంభించనున్నారు. ఆర్థికంగా వెనుకబడిన, పేద విద్యార్థులకు ఈ యూనివర్సిటీలో తగిన స్థానం, ప్రాధాన్యత ఉంటుందని డాక్టర్ సుభాష్ చంద్ర స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన విధి విధానాలను త్వరలోనే పూర్తి చేసి, వచ్చే ఏడాది నుంచే యూనివర్సిటీ విద్యా కార్యకలాపాలు ప్రారంభించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇదిలావుంటే.. 1930 సెప్టెంబర్ 28న జన్మించిన నంద కిషోర్ గోయెంకా క్రమశిక్షణ, మానవీయ విలువలకు మారుపేరుగా నిలిచారు. వ్యాపార కుటుంబంలో జన్మించినప్పటికీ, వాణిజ్య వ్యాపారాలకు దూరంగా ఉంటూ.. జీవితాంతం సనాతన ధర్మ పరిరక్షణకు, సామాజిక సేవకే అంకితమయ్యారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌లో ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా సుదీర్ఘకాలం పాటు ఆయన సేవలు అందించారు. ఆయన ఆశయాలకు అనుగుణంగానే ఈ విద్యాసంస్థను సమాజానికి ఉపయోగపడేలా తీర్చిదిద్దనున్నట్లు ఎస్సెల్ గ్రూప్ ప్రతినిధులు తెలిపారు.

## జగన్ ఫ్రస్టేషన్ అంతకు మించి

విజయవాడ : వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విశాఖపట్నం పర్యటనలో చేసిన వ్యాఖ్యలు, ఇచ్చిన హామీలు చూస్తూ జగన్మోహన్ రెడ్డి పూర్తిగా విచక్షణ కోల్పోతున్నట్లుగా ఎవరికైనా అర్థమైపోతుంది. సముద్రంలో జరిగిన బోటు ప్రమాద బాధితులను పరామర్శించే క్రమంలో ఆయన మాట్లాడిన తీరు, వ్యవస్థలపై చేసిన విమర్శలు ఆయన పారదర్శకతను, చట్టాలపై ఉన్న అవగాహనను ప్రశ్నించేలా ఉన్నాయి. ఒక మాజీ ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి, క్షేత్రస్థాయి న్యాయ సూత్రాలను పక్కనబెట్టి కొంత మందిని మోసం చేయడానికి అడ్డగోలుగా మాట్లాడేస్తున్నారు. సముద్రంలో వేటకు వెళ్లి బోటు మునిగిపోయిన ప్రమాదంలో వ్యవస్థలన్నీ శ్రమించి సహాయక చర్యలు చేపట్టిన విషయాన్ని జగన్ రెడ్డి పూర్తిగా పక్కనబెట్టేశారు. వాళ్లను కాపాడకపోవడం కోస్ట్ గార్డ్ చేసిన తప్పని తేల్చేశారు. కళ్ళు మూసి తెరిచే లోపు మూడేళ్లు అయిపోతాయని, వైసీపీ అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే మత్స్యకార బాధిత కుటుంబాలకు కోటి రూపాయల చొప్పున ఇస్తానని ఆయన హామీ ఇచ్చేశారు. ప్రస్తుతం ప్రతిపక్షంలో ఉండి, బాధితులకు తక్షణమే ఎలాంటి ఆర్థిక సహాయం చేయకుండా, భవిష్యత్తులో అధికారంలోకి వస్తే ప్రజాధనం నుంచి కోటి రూపాయలు ఇస్తానంటూ కాలయాపనతో కూడిన హామీలు ఇవ్వడం బాధితులను మభ్యపెట్టడమే. గతంలో ఆయన హయాంలో వందల మంది మత్స్యకారులు చనిపోతే.. బోట్లు తగలబడిపోతే పైసా ఇవ్వని వ్యక్తి ఆయన అని అందరికీ తెలుసు. మరీ ముఖ్యంగా, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడికి సంబంధించిన హిట్ అండ్ రన్ కేసులో జగన్ వ్యవహరించిన తీరు చట్టాలను తెలిసిన వారిని సైతం ఆగ్రహానికి గురిచేస్తోంది. బైక్ యాక్సిడెంట్ చేసి ఓ నిరుపేద వ్యక్తి మరణానికి కారణమవ్వడమే కాకుండా, పోలీసులను తప్పుదోవ పట్టించేందుకు అసలు సంబంధం లేని మరో యువకుడిని నిందితుడిగా ఇరికించే ప్రయత్నం చేశాడు.




కోలీవుడ్ స్టార్ హీరో, తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్‌పై నటి వరలక్ష్మి శరత్‌కుమార్ సోషల్ మీడియా వేదికగా ఒక సుదీర్ఘమైన, భావోద్వేగ భరితమైన పోస్ట్‌ను పంచుకున్నారు. తాజాగా తన భర్తతో కలిసి విజయ్‌ను కలిసిన ఆమె, ఆ జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ఈ పోస్ట్ గురించి ఏం చెప్పాలా అని చాలా ఆలోచించాను, కానీ ఇప్పటికే ఆయన గురించి చాలా విషయాలు మాట్లాడటం జరిగింది. అందుకే ఇప్పుడు నేను ఒకే ఒక్క మాట చెప్పాలనుకుంటున్నాను. జనాలు వంద రకాలుగా వంద మాటలు మాట్లాడుకోవచ్చు. కానీ, చివరికి వచ్చేసరికి జోసెఫ్ విజయ్ మన ముఖ్యమంత్రి. ఆయన ఇక్కడే ఉంటారు, ప్రజల గుండెల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారు" అంటూ వరలక్ష్మి తన ట్వీట్‌లో విజయ్ రాజకీయ ప్రస్థానాన్ని, ఆయనకున్న ప్రజాదరణను గట్టిగా సమర్థించారు. రాజకీయాల్లో విజయ్ సాధించిన అపూర్వ విజయాన్ని ప్రశంసిస్తూ వరలక్ష్మి విమర్శకులకు గట్టి కౌంటర్ ఇచ్చారు. ఎవరినైనా విమర్శించడం చాలా సులభమని, కానీ రాజకీయాల్లోకి వచ్చిన మొదటి ప్రయత్నంలోనే ఏకంగా ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించడం సామాన్యమైన విషయం కాదని ఆమె పేర్కొన్నారు. దానికి అపారమైన ధైర్యం, బలమైన సంకల్పం, తమిళనాడు ప్రజలు చూపించే ప్రేమ ఎంతో అవసరమని రాసుకొచ్చారు. ప్రజాస్వామ్యంలో ప్రజలు ఇచ్చిన ఈ అధికార స్థానాన్ని మనమందరం గౌరవించాల్సిన బాధ్యత ఉందన్నారు. మాటల కంటే చేతలే ఎప్పుడూ గట్టిగా మాట్లాడతాయని, నిరంతరం తప్పులు వెతికే విమర్శకులకు రాబోయే కాలమే నిజమేంటో చూపిస్తుందని హింట్ ఇచ్చారు. అంతవరకు కాస్త ఓపికతో, గౌరవంతో ఉంటూ, ఆయన ప్రజల కోసం ఏం సాధించబోతున్నారో చూడాలని, ఆయనకు మన మద్దతు, ప్రోత్సాహం అందించాలని వరలక్ష్మి కోరారు.




తెలుగు చిత్ర పరిశ్రమ ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తంగా చాటిచెప్పాడు దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి. 'బాహుబలి', 'ఆర్ఆర్ఆర్' వంటి చిత్రాలతో తెలుగు సినిమాను పాన్ వరల్డ్ స్థాయికి తీసుకెళ్లిన ఘనత ఆయనకే దక్కుతుంది. ప్రస్తుతం జక్కన్న సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా 'వారణాసి' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ప్రియాంక చోప్రా కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో పృథ్వీరాజ్ సుకుమార్ విలన్ పాత్రలో నటిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాను అనుకున్న సమయానికి ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని రాజమౌళి పక్కా ప్లానింగ్‌తో దూసుకుపోతున్నారు. అయితే 'వారణాసి' తర్వాత ఆయన ఏ హీరోతో సినిమా చేయబోతున్నారనే ఆసక్తికరమైన చర్చ ఇప్పుడు అన్ని చిత్ర పరిశ్రమల్లో జోరుగా సాగుతోంది. ప్రస్తుతం సోషల్ మీడియాలో దర్శకధీరుడు రాజమౌళి, సౌత్ స్టార్ హీరో సూర్య కాంబినేషన్‌లో ఒక సినిమా రాబోతుందనే వార్తలు తెగ హల్‌చల్ చేస్తున్నాయి. సూర్యతో ఒక భారీ ప్రాజెక్ట్ చేయడానికి రాజమౌళి కూడా మొగ్గు చూపుతున్నట్లు గట్టి ప్రచారం జరుగుతోంది. ఒకవేళ ఈ టాక్ నిజమైతే గనుక, ఇది ఇండియన్ సినిమాలోనే అత్యంత క్రేజీయెస్ట్ కాంబినేషన్లలో ఒకటిగా నిలవడం ఖాయమని ట్రేడ్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ ఇద్దరు దిగ్గజాలు జత కడితే బాక్సాఫీస్ రికార్డులు తిరగరాయడం ఖాయమని ఫ్యాన్స్ భావిస్తున్నారు. నిజానికి సూర్య–రాజమౌళి కాంబినేషన్‌పై ఇలాంటి వార్తలు రావడం ఇదే మొదటిసారి కాదు. గతంలో కూడా వీరి కలయికపై పలుమార్లు జోరుగా చర్చలు జరిగాయి. అప్పట్లో రాజమౌళి తెరకెక్కించిన ఇండస్ట్రీ హిట్ 'మగధీర' చిత్రం కోసం మొదట సూర్యను సంప్రదించినట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. కానీ, కొన్ని అనివార్య కారణాల వల్ల ఆ క్రేజీ ప్రాజెక్ట్ అప్పట్లో కార్యరూపం దాల్చలేదు. ఆ తర్వాత కూడా పలు సందర్భాల్లో వీరిద్దరూ కలిసి సినిమా చేయబోతున్నారనే వార్తలు వినిపించినప్పటికీ, అవి అధికారికంగా ఎప్పుడూ ఖరారు కాలేదు. తాజాగా మరోసారి ఈ కాంబో తెరపైకి రావడంతో సూర్య అభిమానులు మస్త్ ఖుషీ అవుతున్నారు. అయితే, ఇప్పటివరకు ఈ ప్రాజెక్ట్‌పై రాజమౌళి లేదా సూర్య టీమ్స్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. మరోవైపు, సూర్య ఈ ఏడాది 'కరుప్పు' చిత్రంతో బ్లాక్‌బస్టర్ హిట్ కొట్టి ఫుల్ జోష్‌లో ఉన్నారు. వరుసపెట్టి క్రేజీ సినిమాలు ఒప్పుకుంటూ బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతున్నారు. ప్రస్తుతం ఆయన హీరోగా నటించిన 'విశ్వనాథ్ అండ్ సన్స్' అనే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఆగస్టులో థియేటర్లలో సందడి చేయనుంది. దీని తర్వాత ప్రముఖ నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్‌తో జతకట్టారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కనున్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌కు 'జై భీమ్' చిత్ర దర్శకుడు టి.జి. జ్ఞానవేల్ దర్శకత్వం వహిస్తుండటంతో అంచనాలు అప్పుడే ఆకాశాన్ని తాకుతున్నాయి. మరి మహేష్ బాబు సినిమా పూర్తయ్యాక రాజమౌళి–సూర్య కాంబినేషన్ లో సినిమా నిజంగానే వస్తుందేమో చూడాలి.




అక్షయ్ కుమార్ , సైఫ్ అలీఖాన్ ప్రధాన పాత్రల్లో.. దర్శకుడు ప్రియదర్శన్ రూపొందిస్తోన్న చిత్రం 'హైవాన్' . సరికొత్త థ్రిల్లర్ గా రూపుదిద్దుకుంటోన్న ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్, తెస్పియన్ ఫిలింస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ ప్రెస్టీజియస్ మూవీలో.. ఫస్ట్ టైమ్ అక్షయ్ కుమార్ నెగిటివ్ పాత్రలో నటిస్తున్నారు. సెప్టెంబర్ 11న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోన్న ఈ మూవీ నుంచి తాజాగా మేకర్స్ ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ ఫస్ట్ లుక్ పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ పోస్టర్‌లో అక్షయ్ కుమార్, సైఫ్ అలీఖాన్ క్యారెక్టర్స్ ఇంటెన్స్ లుక్స్‌తో ఆకట్టుకుంటున్నాయి. ప్రియదర్శన్ శైలిలో సాగే ఒక యూనిక్ థ్రిల్లర్ చిత్రంగా 'హైవాన్' రూపొందుతున్నట్లుగా ఈ ఫస్ట్ లుక్ తెలియజేస్తోంది. ఈ చిత్రంతో డైరెక్టర్ ప్రియదర్శన్ ప్రేక్షకుల్ని ఒక డార్క్, థ్రిల్లింగ్ వరల్డ్‌లోకి తీసుకెళ్లనున్నారు. ఈ ఏడాది ప్రేక్షకులు ఎదురుచూస్తున్న మోస్ట్ అవేటెడ్ మూవీస్‌లో ఈ సినిమా కూడా ఒకటి. ఫస్ట్ లుక్ అనంతరం వెంటనే టీజర్ విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఇకపై వరస అప్డేట్స్ ఈ మూవీ నుంచి రానున్నాయని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రంలోకి ఇతర కీలక పాత్రల్లో బొమన్ ఇరానీ, సయామీ ఖేర్, శ్రియ పిల్గాంకర్ నటిస్తున్నారు. హైవాన్ మూవీతో అక్షయ్ కుమార్, సైఫ్ అలీఖాన్ దాదాపు 17 ఏళ్ల తర్వాత కలిసి నటిస్తుండటం విశేషం.







జయం' సినిమాతో టాలీవుడ్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి, మొదటి చిత్రంతోనే బ్లాక్‌బస్టర్ హిట్‌ను అందుకున్న హీరో నితిన్ . 2002లో తేజ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రంలో తనదైన నటనతో మెప్పించిన ఆయన, ఉత్తమ నూతన నటుడిగా ప్రతిష్టాత్మక ఫిలింఫేర్ అవార్డును సైతం సొంతం చేసుకున్నారు. ఆ తర్వాత రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన 'సై', అలాగే వి.వి. వినాయక్ కాంబినేషన్‌లో వచ్చిన 'దిల్' వంటి చిత్రాలతో మాస్, యూత్ ప్రేక్షకులకు విపరీతంగా కనెక్ట్ అయ్యారు. కెరీర్‌లో వరుసగా కొన్ని ఒడిదొడుకులు, పరాజయాలు ఎదురైనప్పటికీ.. ఏమాత్రం అధైర్యపడకుండా 'ఇష్క్', 'గుండెజారి గల్లంతయ్యిందే' చిత్రాలతో గ్రాండ్ కంబ్యాక్ ఇచ్చి, పడి లేచిన కెరటంలా టాలీవుడ్‌లో దూసుకుపోయారు. అయితే, 2020లో విడుదలైన 'భీష్మ' సినిమా తర్వాత నితిన్‌కు మళ్లీ ఆ స్థాయి సాలిడ్ హిట్ మాత్రం దక్కలేదు. ఆ తర్వాత ఆయన నటించిన ఆరు సినిమాలు బాక్సాఫీస్ వద్ద బోల్తా పడటంతో, ఈ సారి ఎలాగైనా సాలిడ్ హిట్ కొట్టాలనే గట్టి పట్టుదలతో నితిన్ ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే నితిన్ మరోసారి సక్సెస్ బాట పట్టాలని టార్గెట్‌గా పెట్టుకుని, ఒకేసారి మూడు విభిన్న ప్రాజెక్ట్‌లను లైన్లో పెట్టినట్లు ఇండస్ట్రీ వర్గాల్లో గట్టిగా చర్చ సాగుతోంది. కమర్షియల్ ఎంటర్‌టైనర్ నుంచి కంటెంట్ ఓరియెంటెడ్ సినిమాల వరకు, అలాగే సరికొత్త కాంబినేషన్లలో వైవిధ్యమైన కథలను ఆయన ఒకే చేసినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ క్రేజీ లైనప్‌లో భాగంగా, సూర్యదేవర నాగవంశీ నిర్మాణంలో సోమశేఖర్ సరిపల్లి, నాని కాసిరెడ్డి అనే యువ దర్శకులు తెరకెక్కించబోయే చిత్రంలో నితిన్ నటించనున్నట్లు సమాచారం. ఈ సినిమాను ఈ ఏడాది క్రిస్మస్ కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు ఇండస్ట్రీ టాక్.

మరోవైపు, నేచరల్ స్టార్ నాని నిర్మాణ సంస్థ వాల్ పోస్టర్ సినిమా బ్యానర్‌లో నితిన్ ఒక విభిన్నమైన కంటెంట్ ఓరియెంటెడ్ చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని సమాచారం. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ప్రీ–ప్రొడక్షన్ పనులు ప్రస్తుతం వేగంగా జరుగుతున్నాయని, సరికొత్త జోనర్‌లో సాగే ఈ కథ నితిన్ కెరీర్‌లో చాలా ప్రత్యేకంగా నిలవనుందని జోరుగా ప్రచారం సాగుతోంది. ఇక ఇదే సమయంలో రీసెంట్‌గా 'ఆయ్' చిత్రంతో బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకున్న యంగ్ డైరెక్టర్ అంజి బాబుతో కూడా నితిన్ ఒక కొత్త ప్రాజెక్ట్‌కు ఓకే చెప్పినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ క్రేజీ చిత్రాన్ని నితిన్ హోమ్ బ్యానర్ అయిన శ్రేష్ఠ్ మూవీస్ నిర్మించనుందని టాక్ వినిపిస్తోంది. ప్రస్తుతం ఫిలిం నగర్ సర్కిల్స్‌లో జోరుగా ప్రచారం సాగుతున్న ఈ మూడు సినిమాలపై ఆయా చిత్రబృందాల నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటనలు వెలువడలేదు. అయినప్పటికీ, నితిన్ ఈ మూడు విభిన్న లైనప్‌లతో బలమైన కంబ్యాక్‌కు సిద్ధమవుతున్నారనే వార్తలు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. మరి ఈ ట్రిపుల్ లైనప్ నితిన్‌ను మరోసారి టాలీవుడ్ టాప్ రేస్‌లో నిలబెడుతుందో లేదో చూడాలి!.




OWNED, PRINTED AND PUBLISHED BY KARNAM BHASKAR RAO, PRINTED AT SHREYA SREE PRINTERS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST., T.S. PUBLISHED AT SREEJA SREE PUBLICATONS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST, T.S, RNI NO: APTEL/2012/47246 EDITOR : KARNAM BHASKAR RAO, Ph: 08542-222814, Cell: 9848997085